RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 64 పేజీలు - 08 శనివారం 31 జనవరి 2026

## తెలంగాణలో ఏమీ సాధించుకోలేక పోయాం

### - సమ్మక్క జాతరలో కవిత ఆవేదన

**తొలి అక్షరం/ములుగు,జనవరి30:** తెలంగాణ ఏర్పడిన తర్వాత 12 ఏండ్లలో ఏమీ సాధించుకోలేక పోయామని మాజీ ఎమ్మెల్సీ,తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో వేటిని కూడా సంపూర్ణంగా సాధించుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కూడా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మను ఆమె దర్శించుకున్నారు. అంతకు ముందు గట్టమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిలువెత్తు బంగారాన్ని అందించి మొక్కులు తీర్చుకున్నా రు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. అమ్మవార్లు వారి జాతి కోసం చేసిన పోరాటం చరిత్రాత్మకమని చెప్పారు. ఇవాళ తెలంగాణ జాతి కోసం అందరం నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. మన హక్కులను సాధించుకునేందుకు సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితో పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. తల్లుల దయతో తెలంగాణ బాగుండాలని కోరుకుంటున్నట్టు ఆమె తెలిపారు.



## తెలంగాణ రైజింగ్ 2047

# లక్ష్యాల సాధనకు కృషి


**అన్ని శాఖలు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలి**

**వ్యవసాయ, మత్స్య, కార్మిక శాఖలతో సిఎస్ సమీక్ష**





**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 30:** తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల మేరకు అన్ని ప్రభుత్వ విభాగాలకు దిశానిర్ధేశం చేసేందుకు గత మూడు రోజులుగా విభాగాల వారీగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఈ రోజు వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, ఆహార, పౌర సరఫరాల, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, జి.ఎ.డి సర్వీసెస్ శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికను దృష్టి లో పెట్టుకొని నిర్ధేశిత లక్ష్యాలను చేరుకోవాలని మిగతా2లో...





## మహాత్మాగాంధీ

# 78వ వర్ధంతి

**● రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన రాష్ట్రపతి,ప్రధాని ● మహాత్ముడికి నివాళి అర్పించిన చంద్రబాబు**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 30:** మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి. అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన చిహ్నంగా నిలుస్తారని తెలిపారు.మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకలు మరియు సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది. ఆయన వ్యక్తిత్వం మరియు విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా మిగతా2లో...



## ఆర్థికమంత్రిగా

# నిర్మలమ్మ రికార్డు

**వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ సమర్పణ**

**అత్యధికసార్లు ప్రవేశ పెట్టిన మహిళా మంత్రిగా ఘనత**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 30:** నిర్మలా సీతారా మన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెడెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని మిగతా2లో...

## హార్వర్డ్ వర్సిటీలో

# సిఎం రేవంత్ శిక్షణ

**- వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి**



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 30:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూని వర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్న మెంట్‌లోఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. లీడర్ షిప్ అనే కోర్సును పూర్తిచేసి సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. జనవరి 25న ఈ కోర్సు ప్రారంభమవగా జనవరి 30 వరకు అంటే వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ కోర్సులో సీఎం రేవంత్‌తో పాటు 62 మంది కోహోర్ట్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. దాదాపు 20కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు ఇందులో భాగస్వాములయ్యారు.

అమెరికాలోని కేంబ్రిడ్జ్‌లో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ రేవంత్ రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరయ్యారు. కేస్ స్టడీలు, గ్రూప్ డిస్కషన్లు, కన్సల్టేటివ్ వర్క్‌లతో

మిగతా2లో...




## వెదురు కర్రలే దైవాలుగా..

# గద్దెలే గర్భగుడులుగా...

**● కోట్లాది హృదయాలను ఏకం చేస్తున్న జాతర ● మేడారం మహా జాతరకు ప్రముఖుల రాక ● గవర్నర్, డిజిపి, మంత్రుల దర్శనాలు**

# కెసిఆర్‌కు సిట్ షాక్

- మరోమారు నోటీసులు జారీ
- ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ
- నందినగర్ ఇంట్లోనే విచారిస్తామని వెల్లడి
- ఆదివారం 3గంటలకు విచారణకు సిద్దంగా ఉండాలని నోటీస్
- న్యాయనిపుణులతో చర్చించి నోటీసులు ఇచ్చిన సిట్

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 30 :** ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శు క్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, నిన్న( గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు విచారణకు అందుబాటు లో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. ఎర్రవల్లిలోని తనఫామ్ హౌస్‌లోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్ధనను

మిగతా2లో...





## మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్..


**- రేపే ప్రమాణస్వీకారం..!**

**తొలి అక్షరం/మహారాష్ట్ర,జనవరి 30:** మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణంతో నెలకొన్న రాజకీయ శూన్యతకు తెరపడింది. తదుపరి ఉపముఖ్యమంత్రి ఆయన భార్య సునేత్ర పవార్ నియామకం ఖరారైంది. దివంగత అజిత్ దాదా స్థానంలో ఆమె శనివారం ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని

మిగతా2లో...

## జలశక్తి కమిటీ ముందు

# ముగిసిన భేటీ



**పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును తొలగించాలి**

**కమిటీ ముందు తెలంగాణ డిమాండ్**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 30 :** కేంద్ర జలవివాదాల పరిష్కా ర కమిటీ సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటలపాటు ఈ భేటీ జరిగింది. 12 అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం మిగతా2లో...

## తెలంగాణ నీటి ప్రయోజనాలను

# వదులుకోం

- పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు పై చర్చే లేదు
- హరీష్ రావు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి
- పదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 30:** కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలవరం -నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని అధికారులు

మిగతా2లో...

# ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్ర్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవే శపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూ డు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్ తో ముందుకు రానున్నరు. ఈ మూడేళ్లు ఆమె ఆర్థికమంత్రిగా కొనసాగితే రికార్డు సృష్టించడం ఖాయం.

# తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. పోలవరం - బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని శుక్రవారం నాటి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. దిల్లీ సమావేశం గురించి మాజీమంత్రి హరీశ్ రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన... తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం దాదాపు రెండు గంటల ఈ భేటీ సాగింది. ఈ అంశంపై తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి 12 అంశాలు చర్చించాలని ప్రతిపాదించామన్నారు. పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టొద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పలు జల వివాదాలు ఉన్నాయి.. కృష్ణా, గోదావరి జలాలపై అనేక అంశాలు ఉన్నాయి, అందుకే సమావేశానికి వచ్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ తన అజెండాను చెప్పలేదని.. తదుపరి సమావేశం సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం.. ఈ అంశంపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు.

# వెదురు కర్రలే దైవాలుగా.. గద్దెలే గర్భగుడులుగా...

**తొలి అక్షరం/మేడారం,జనవరి 30 :** వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు,కుంకుమలే వజ్రాభరణాలుగా, బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా, చీర ముక్కరైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. వన దేవత మన దేవత జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు. జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి. మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు. సమ్మక్క?సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు శ్రీ సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అమ్మవార్లను దర్శించుకున్నారు .మంత్రి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారా యణ అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు.బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు .ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు.

# కెసిఆర్‌కు సిట్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

సిట్ తిరస్కరించింది. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కేసీఆర్ కు సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని జనవరి 29న 160 సీఆర్ పీసీ కింద సిట్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండగా..బంజారాహిల్స్ లోని నందినగర్ లో ఆయన నివాసంలో అధికారులు నోటీసులు అందించారు. జనవరి 30న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు కేసీఆర్ లేఖ రాశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్ లోనే ఎలాంటి నోటీసులైనా..ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ అడ్రస్ కే పంపాలని విన్నవించారు. అయితే కేసీఆర్ వినతిపై న్యాయనిపుణులతో చర్చించిన సిట్ ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అలాగే ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3గంటలకు బంజారాహిల్స్ నందినగర్లోని కేసీఆర్ నివాసంలో విచారిస్తామని నోటీసు జారీ చేసింది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

# తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల సాధనకు కృషి

(మొదటి పేజీ తరువాయి)

అదే విధంగా భవిష్యత్ లో యూరియా, ఎరువుల పంపిణీని ఐటి ఆధారిత సేవల ద్వారా పటిష్టంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హార్టికల్చర్ శాఖలలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. ఆయిల్ పామ్ ఎ÷-లాంటేషన్, ప్రజల అవసరాల మేరకు పండ్లు, కూరగాయల పెంపకం విస్తృతంగా ప్రోత్సహించాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం హైబ్రిడ్ మోడ్ లో భాగంగా చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. అదే విధంగా రాష్ట్రంలో రైతుల సంక్షేమం, పంటల దిగుబడి, రైతు సమస్యల పట్ల వ్యవసాయ శాఖ నిరంతర మానిటరింగ్ చేయాలని డిజిటల్ క్రాప్ సర్వే కూడా నిర్వహించాలని సూచించారు.ఊష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రస్తుత స్థితిగతులు, రైతులకు అందుతున్న సేవలు, సాగునీటి లభ్యత, విత్తనాలు?ఎరువుల సరఫరా, పంటల దిగుబడి, అలాగే సహకార శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రాబోయే సాగు కాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తగినంతగా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సహకార సంఘాల పనితీరు, రైతు సహకార సంఘాల ఆర్థిక స్థితి, రుణాల పంపిణీ పై సమీక్ష చేశారు. సహకార సంఘాలను మరింత పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పారదర్శకతతో కూడిన వ్యవస్థను అమలు చేయాలని, రైతుల విశ్వాసాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అన్నదానిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, సమస్యలు ఎదురైన చోట వెంటనే పరిష్కరించాలని సి.ఎస్ స్పష్టం చేశారు.పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖ : అనంతరం పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖలపై సి.ఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పశు సంవర్ధక రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, డెయిరీ రంగంలో ఉత్పత్తి పెంపు, రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంపై చేపట్టిన కార్యక్రమాలు, మత్స్యశాఖ ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల పురోగతిని ప్రధాన కార్యదర్శి సమీక్షించారు.శువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

పశువుల వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. డెయిరీ అభివృద్ధి అంశంలో పాల సేకరణ, శీతలీకరణ కేంద్రాల సామర్థ్యాన్ని పెంచాలని, చిన్న, సన్నకారు పాడి రైతులకు లాభదాయకంగా ఉండే విధంగా విధానాలు రూపొందించాలని పేర్కొన్నారు. సహకార డెయిరీ సంస్థల పనితీరును మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మత్స్యశాఖ సమీక్షలో, చేపల ఉత్పత్తి పెంపు, చెరువులు, కుంటలు, మల్లన్న సాగర్, కొండపోచమ్మ, మిడ్ మానేరు, పాలేరు తదితర జలాశయాల్లో చేపల పెంపకం పై కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. మత్స్యకారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మత్స్యకారుల సంక్షేమ పథకాలు సమయానికి లబ్ధిదారులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అలసత్వం వహించకూడదని సి.ఎస్ స్పష్టం చేశారు.

# మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి, ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు మరియు సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించుకున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు.జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్ర్యం సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

# మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్ర పవార్..

(మొదటి పేజీ తరువాయి)

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భర్త మరణంతో కుంగిపోయిన ఆమె.. ఎన్సీపీ సీనియర్ నేతల ప్రతిపాదనను అంగీకరిస్తూ బాధ్యతలు స్వీకరించేందుకు ముందుకొచ్చారు. మహారాష్ట్ర తొలి మహిళా ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర గుర్తింపు సాధించనున్నారు.బారమతి విమాన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణంతో తదుపరి డిప్యూటీ సీఎం ఎవరు? నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (NCPని నడిపించేది ఎవరు? అనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాన్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు పవార్ స్థానాన్ని ఆశించారు కూడా. అయితే.. కొందరు సీనియర్ నాయకులు మాత్రం అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ పేరును ప్రతిపాదించారు. రాజకీయ దురంధరుడైన అజిత్ దాదా వారసత్వాన్ని కొనసాగించేందుకు సునేత్రనే సరైన వ్యక్తి అని వారందరూ తీర్మానించారు.

# జలశక్తి కమిటీ ముందు ముగిసిన భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించింది.. పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టవద్దని కోరింది. ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50 శాతం వాడుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ అధికారులు లేవనెత్తిన పలు అంశాలపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. వారంలోగా అజెండా అంశాలు ఖరారు చేసి లిఖితపూర్వకంగా ఇవ్వాలని సీడబ్ల్యూసీ ఛైర్మన్ తెలిపారు. అజెండా అంశాలు ఖరారయ్యాక భేటీ తేదీని ఖరారు చేస్తామని ఛైర్మన్ స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య నదీ జలాల నిర్వహణ, వినియోగం విషయంలో కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేసిన కమిటీ తొలి సమావేశం శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైంది. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన జరుగుతోంది. కమిటీ తదుపరి చర్చల కోసం జల వివాదాలకు సంబంధించిన అజెండా అందజేయాలని కమిటీ సభ్యులను సీడబ్ల్యూసీ ఛైర్మన్ కోరారు. ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జలవనరుల శాఖ సలహాదారులు, ఇంజనీర్ ఇన్- చీఫ్‌లు, జలవనరుల శాఖ అధికా రులు, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ ఛైర్మన్లు, ఎన్‌డబ్ల్యూడీఏ చీఫ్ ఇంజనీర్ హాజరయ్యారు. ఏపీ నుంచి జలవనరుల శాఖ అడ్వైజర్- వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి పలువురు అధికారులు హాజరయ్యారు. అలాగే తెలంగాణ నుంచి ఆదిత్యనాథ్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అంజద్ హుస్సేన్, కేంద్ర రాష్ట్ర సమన్వయ అధికారి గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు.

# హార్వర్డ్ వర్సిటీలో సిఎం రేవంత్ శిక్షణ

(మొదటి పేజీ తరువాయి)

కూడిన ఇంటెన్సివ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అధికారం, నాయకత్వం, సంఘర్షణలు, అనిశ్చితి వంటి అంశాలపై శిక్షణ పొందారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితో పాటు మిగిలిన 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

# నాంపల్లి ఫర్నీచర్ షాప్ అగ్నిప్రమాదం

- కంటతడి పెట్టిస్తున్న మృతుడి ఫోన్ కాల్ ఆడియో
- రక్షించాలంటూ వేడుకున్న ఇంతియాజ్



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 30:** నాంపల్లి ఫర్నీచర్ షాపులో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నెల 24న షాపులోని సెల్లార్‌లో చెలరేగిన మంటల్లో చిక్కుకుని ఐదుగురు మరణించారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి ఒక బాధితుడి కాల్ రికార్డింగ్ ఆడియో లీకైంది. మృతుల్లో ఒకరైన ఇంతియాజ్ అనే యువకుడు.. అగ్ని ప్రమాదం సంభవించిన తర్వాత తన స్నేహితుడికి ఫోన్ చేసి, రక్షించమని వేడుకున్నాడు. తాను మంటల్లో లోపల చిక్కుకున్నట్లు, బయటకు రావడానికి ఏమీ కనిపించడం లేదని స్నేహితుడికి చెప్పాడు. అందులోంచి బయటకు రావడానికి అన్ని దారులు మూసుకుపోయాయని ఫోన్లో చెప్పాడు. తనతోపాటు పిల్లలు కూడా ఉన్నట్లు తెలిపాడు. ప్రస్తుతం ఇంతియాజ్‌కు సంబంధించిన ఈ ఆడియో వైరల్ అవుతోంది. ప్రాణాలు కోల్పోవడానికి కొద్ది సేపటి ముందు కాల్‌లో అతడి ఆవేదన అందరినీ కలిచివేస్తోంది. చివరి క్షణాల్లో బాధితుల వేదన కూడా రికార్డయ్యింది. ఘటనకు సంబంధించి.. సెల్లార్‌లోని ఫర్నీచర్ షాపులో మంటలు చెలరేగి, భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో లోపల ఉన్న ఐదుగురు అందులో చిక్కుకుపోయారు. చుట్టూ పొగ, మంటల ధాటికి బయటికి రాలేకపోయారు. బయటికొచ్చే ఏ మార్గం లేకపోవడంతో అందులోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అందరూ బయటికొచ్చేశారు. లోపల గార్డు యాదయ్య కుమారులు ప్రణీత్, అఖిల్ ఉండిపోయారు. వారిని కాపాడేందుకు ఉస్మాన్ ఖాన్, ఆయన భార్య బేబి, ఇంతియాజ్ వెళ్లారు. చివరకు ఈ ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

# యాదాద్రిలో చిన్న మేడారం జాతర సంబరాలు





తొలి అక్షరం/రామన్నపేట జనవరి 30:కుర్రారం గ్రామం చిన్న మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చిన యాదాద్రి భువనగిరి జిల్లా కుమ్మర సంఘం నాయకులు.యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కుర్రారం గ్రామంలో సమ్మక్క సారలమ్మల జాతర సందర్భంగా మండలంలో చిన్న మేడారం చల్లూరి శివారులోని యాదాద్రి మేడారం లక్ష్మక్క పల్లి గ్రామంలో గురువారం సాయంత్రం సమ్మక్క గద్దపై చేరారు. బూరుగుపల్లి శివారులోని పులిగుట్ట నుంచి ప్రత్యేక పూజలు అనంతరం డబ్బు చప్పులతో శివసత్తుల పూనకాలు భక్తుల నినాదాలతో ప్రదర్శనగా తీసుకొచ్చారు. ఆలయం ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలసందడి కనిపించింది. మొక్కులు చెల్లించి నిలువెత్తు బంగారం సమర్పించారు. కుర్రారం గ్రామ నాయకులు తరిగొప్పల నరసింహ మరియు భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన సమ్మక్క సారమ్మల పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా యాదాద్రి భువనగిరి జిల్లా కుమ్మర సంఘం అధ్యక్షులు ఓరుగంటి గోపాల్ మరియు ప్రధాన కార్యదర్శి దరిపల్లి ప్రవీణ్ కుమార్ తోపాటు జిల్లా ఉపాధ్యక్షులు దొమ్మాట మహేష్, జిల్లా సహాయ కార్యదర్శి నాగపురి పుల్లయ్య, రాజపేట మండల కన్వీనర్ బోనాల వెంకటేష్ కో-కన్వీనర్ కట్కూరి వెంకటేష్, తవిటి కృష్ణమూర్తి, ఇంద్రపాల ఆంజనేయులు, దొమ్మాట వేణుగోపాల్, చలమలపల్లి లక్ష్మణ్, కందుకూరి రామచందర్ లు జిల్లా కుమ్మరి సంఘం నాయకుడు అందరూ హాజరై అమ్మవారి కృపకు పాత్రుడైనారు. మీ శ్రేయోభిలాషి దరిపల్లి ప్రవీణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి యాదాద్రి భువనగిరి జిల్లా సెల్ : 92469 69401

# విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుకులం స్టడీ మెటీరియల్ అందజేత



తొలి అక్షరం/రామన్నపేట జనవరి 30: విశ్రాంత ఉపాధ్యాయులు అనుముల అంతయ్య స్మారకార్థం వారి కుమారుడు అనుముల శ్రీనివాస్ విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యం లో వెల్లంకి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురుకులం ఉచిత స్టడీ మెటీరియల్ ను ఫౌండేషన్ ప్రోగ్రాం కో - ఆర్డినేటర్ నకరేకంటి సతీష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గత సంవత్సరం కూడా వెల్లంకి ప్రాథమిక పాఠశాల లో ఉచిత స్టడీ మెటీరీయల్ వినియోగించుకొని పదమూడు మంది విద్యార్థులు సీట్లు పొందారు అలాగే ఈ సంవత్సరం కూడా అందరూ సీట్లు పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభగల పేద విద్యార్థులు ఇట్టి మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న విపంచి ఫౌండేషన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు , ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సోమిరెడ్డి , వెంకటేశం ,సువర్ణ,మాధవి విద్యాకమిటీ ఛైర్మన్ సులోచన,మాజీ ఎం పి టి సి ఎర్రోల్ల సుక్కమ్మ తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ ఎన్ అశోక్ కుమార్, ఎర్రోళ్ల మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ గుట్ట బ్రహ్మోత్సవ ఆహ్వానం పత్రిక ఆవిష్కరించిన సర్పంచ్ గర్దాసు విక్రమ్



తొలి అక్షరం/రామన్నపేట జనవరి 30: ఇంద్రపాలనగరంలోని శ్రీ శంకర్ స్వామి బ్రహ్మోత్సవ ఆహ్వానం గోడ పత్రికను ఆవిష్కరించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ కళ్యాణం శివరాత్రి రోజు తేది 15ఫిబ్రవరి రాత్రి 11.40నిముషాలకు జరుగుతుంది.ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి , వార్డ్ మెంబెర్ లు వరికుప్పల స్వామి,దేవస్థానం ఉత్సవ కమిటీ అధ్యక్షులు సింగణబోయిన పాండరి యాదవ్ కమిటీ సభ్యులు,యువనాయకులు సింగణబోయిన గణేష్ యాదవ్ , మందడి విద్యాసాగర్ రెడ్డి ,శ్రీధర్ రెడ్డి , రేపాక సత్తయ్య రవ్వ నరసింహ సింగన బోయిన జంగయ్య ,శ్రీశైలం సత్యనారాయణ దాసు,వీర్లపల్లి మల్లయ్య , రాజన్నగారి రమేష్ తౌటమ్ శంకరయ్య, గర్దాస్ వెంకటేశం ,కన్నయ్య పద్మారావు ,కొలు కుల పెల్లి యాదయ్య బాజా నరేందర్ ,గునిగంటి రామలింగం,మర్రి యాదయ్య, వెంకటేశం సత్తయ్య, శంకర్ జిట్టబోయిన వెంకటేశం, నక్క వెంకటేష్ ,గండు ఆంజనేయులు కంబాలపల్లి శ్రీశైలం,మర్రి మహేష్ ,కోటపల్లిమహేష్ ,బోనగిరి సంజీవ ,మహేష్ తదితరులు పాల్గొన్నారు

# మన వార్డు మన బాధ్యత, వార్డు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- 9వ వార్డు సభ్యులు నోముల అనిత, 12వ వార్డు సభ్యులు గొరిగే పారిజాత, 13వ వార్డు సభ్యులు కొమ్ము రామస్వామి





తొలి అక్షరం/రామన్నపేట జనవరి 30: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని మనండలంలోని రామన్నపేట మండల కేంద్రానికి చెందిన 9వ వార్డు మెంబర్ నోముల అనిత 12వ వార్డు మెంబర్ గొరిగే పారిజాత 13వ వార్డు మెంబర్ కొమ్ము. రామస్వామి. శుక్రవారం వార్డులోని వివిధ వీధులలో మోరీలను చెత్తను సిబ్బందితో తొలగిస్తూ, మన పరిసరాలలో ఇండ్ల వద్ద మొరీల వద్ద చెత్తను వేయకూడదని అలా వేస్తే మొరిలోని నీరు అలానే నిలిచిపోయి దోమలు రావటం వలన అనారోగ్యాలకు గురి అవుతామని ఆయన అన్నారు. తొలగించిన చెత్తను కాల్చివేసి, వార్డులని స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణ సహకారంతో అన్ని విధాలుగా అభివృద్ధి చేసి సస్యశామలం చేస్తామని తెలిపారు.

# సీనియర్ జర్నలిస్ట్ కేపీ స్ఫూర్తితోనే ఈ అవార్డు దక్కింది: జర్నలిస్ట్ శంకర్

- జాతీయ సమైక్యత పురస్కారం గ్రహీత జర్నలిస్టు శంకర్‌కు ఘన సన్మానం
- సీనియర్ జర్నలిస్టు కెపి స్వగృహంలో సత్కారం





తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 30: జాతీయ సమైక్యత పురస్కారం అందుకున్న జర్నలిస్టు శంకర్‌ను టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖాజా పాషా, టీయూడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ మీడియా అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు కెపి స్వగృహంలో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఖాజా పాషా మాట్లాడుతూ రచయితగా, జర్నలిస్టుగా శంకర్ మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఆయన విజ్ఞానం ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడాలని, సమాజ హితం కోసం అక్షరాలు మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. యువ జర్నలిస్టులకు ఆదర్శంగా నిలవాలని ఆశీర్వదించారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో పురస్కారాలు అందుకోవాలని అభినందించారు.టిడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ అన్యాయం జరిగిన ప్రతి చోట జర్నలిస్టులు ప్రశ్నించే ధైర్యం కలిగి ఉండాలని అన్నారు. ప్రజా సమస్యలను వెలికితీయడంలో మరింత కృషి చేయాలని సూచించారు. ప్రజల విశ్వాసమే జర్నలిస్టుకు గొప్ప బలం అని పేర్కొన్నారు.శంకర్ మాట్లాడుతూ...సీనియర్ జర్నలిస్టు ఖాజా పాషా అన్నగారిని స్ఫూర్తిగా తీసుకుని మొదట తన కథనాలను ప్రారంభించానని తెలిపారు. అనంతరం రచనలు కొనసాగించేందుకు ఆయన ప్రోత్సాహమే తనకు ధైర్యం ఇచ్చిందన్నారు. ఈ గుర్తింపు రావడానికి ఖాజా పాషా మార్గదర్శకత్వమే కారణమని, వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల పక్షాన కలం నడిపిస్తూ నిజాయితీతో సేవలు కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శివ, వానరాసి జగన్,తదితరులు పాల్గొన్నారు.


# నాణ్యత లేని ప్రభుత్వ నిర్మాణాలు కమీషన్ల పాలు.....





తొలి అక్షరం/రామన్నపేట జనవరి 30: పది మందికి ఉపయోగపడే ఏ నిర్మాణాలను అయినా పది కాలాలు ఉండాలని నిర్మాణాలు చేపడుతారు. రాజుల సొమ్ము రాళ్ళపాలు అంటారు, రాళ్ళ నిర్మాణాలు అయినా ఏండ్ల కింద కట్టినవి ఇంకా ప్రజలకు ఉపయోగపడుతున్నాయి. కానీ ఇక్కడ యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ మండల పరిషత్తు భవనం పక్కనే ఉన్న స్త్రీశక్తి ఉపాధి హామీ భవనం నిర్మాణం అయిన పన్నెండు, పదమూడు సంవత్సరాలకే ఇలా స్లాబ్ పెచ్చులు ఊడుతుంది. ఎంత నాణ్యంగా కడితే కానీ ఇలాంటి నిర్మాణాలు నిర్మించబడవు. ఈ స్త్రీశక్తి ఉపాధి హామీ భవణం హాలులో కూర్చోవడాని ప్రజలు, సమావేశాలు నిర్వహించడానికి అధికారులే భయపడుతున్నారు. ఎప్పుడు ఎవరి తలలపై పెచ్చులు ఊడి పడి గాయాలవుతాయో, ఎవరి ప్రాణాలకు ఏమి ప్రమాదం వస్తుందో అనే భయాందోళనలో వారంతా గడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, నాణ్యత లేని స్లాబ్ కు మరమ్మతులు చేయాలని, దీనిని దృష్టిలో ఉంచుకొని అయినా ఇకముందు నిర్మించే నిర్మాణాలను కాస్త నాణ్యంగా అయినా కడితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

# కాలనీ సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్‌కు వినతి





తొలి అక్షరం/ మేడిపల్లి/ జనవరి 30: జిహెచ్ఎంసి పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ దేవేందర్ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు మహేష్ కోరారు. ఈ మేరకు పలువురు కాలనీవాసులతో కలిసి పోడు ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజను కలిపి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, చుట్టుపక్కల ఉన్న చెరువులలో గుర్రపు డెక్కను తొలగించి దోమల బెడద నుంచి కాపాడాలని కోరారు. తమ కాలనీ చుట్టూ ఉన్న కాల్వలు, చెరువుల్లో గుర్రపు డెక్క పేరుకుపోయి దోమల తీవ్రత పెరగడంతో పాటు విపరీతమైన దుర్గంధం వస్తుందని స్థానిక ప్రజలు తీవ్రంగా బాధపడుతున్నారని వివరించారు.. అధికారులు స్పందించి తమ సమస్యను తీర్చాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జిన్నరాజు,దేవేందర్ నగర్ మాజీ అధ్యక్షులు దుప్పల్లి భగవాన్, ఉపాధ్యక్షులు పంగ రమేష్,జోగి సుధాకర్, మధు కుమార్ మాదిగ, సోమేశ్ కురుమ, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డు అందుకున్న గాలయ్యను సన్మానించిన నాయకులు



తొలి అక్షరం/రామన్నపేట జనవరి 30: రామన్నపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్‌అస్టెంట్ గాలయ్య ఉద్యోగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందున జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి జమీరుద్దీన్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కక్కిరేణి రవీందర్, మినుముల సందీప్, సోషల్ మీడియాలో మండల కో ఆర్డినేటర్ ఎండి అజార్, మహమ్మద్ రిజ్వాన్ పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక మాఫియా

- అనుమతి లేకుండా నిల్వచేసి అధిక రేట్లకు విక్రయం
- పట్టించుకోని అధికారులు



తొలి అక్షరం/ఏన్కూర్ జనవరి 31: ఏన్కూర్ మండల కేంద్రంగా కొందరు దళారీ అక్రమదారులు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఇసుకను టన్నులకొద్ది నిల్వచేసి అవసరం కొద్ది అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. ఏన్కూర్ ప్రధాన కేంద్రంగా ఇంత వ్యవహారం నడుస్తున్న కూడా నిమ్మకు నీరెత్తనట్టు అధికారులు పట్టించుకోని వైనం. అనుమతి లేకుండా ఇష్టరాజ్యంగా అధిక రేట్లు పెంచి ఇసుక రవాణా చేస్తున్నారు. మండల కేంద్రంలో అధికారులు ఉన్నారా, నిద్రావస్థలో ఉన్నారా అర్థం కానీ తీరు. ఇటువంటి ఇసుక మాఫియా ను అధికారులు ఇకనైనా అడ్డుకట్ట వేసి తగిన చర్యలు తీసుకోవాలి.

## 16వ విడుత సామాజిక తనిఖీ






**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 30:** రామన్నపేట మండల కేంద్రంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో విజయవంతంగా పూర్తి చేసిన ప్రీసైడింగ్ అధికారి అడిషనల్ డి ఆర్ డి ఓ సురేష్ కి, డి వివో ఉపేందర్ రెడ్డి కి, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ పసిముద్దీన్ కి, ఎంపీడీవో రాములు, ఎంపీ ఓ రాహుఫ్, సామాజిక తనిఖీ ఎస్ఆర్పి అశోక్ కి, అందరు పంచాయతీ కార్యదర్శులకు, ఈజిసి తనిఖీ సిబ్బందికి, సర్పంచ్ లకు, పాత్రికేయులకు, సిబ్బంది అందరికి పేరు,పేరున ఏపీఓ వెంకన్న ధన్యవాదములు.తెలిపినారు

## ముగిసిన క్రీడా పోటీలు



**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 30:** రామన్నపేట మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీ లు నిర్వహించి, గెలిచిన టీమ్ ల కు బహుమతి లు అందచేయటం జరిగింది. ఎంపిడిఓ ఆవుల రాములు, తహసిల్దార్ లాల్ బహదూర్, ఎస్ ఐ డి. నాగరాజు, ఎంపీ వో రావూఫ్ ఆలీ, ఎం ఇ ఓ జ్యోతి సర్పంచ్ సత్యనారాయణ , ఉప సర్పంచ్ మోటే. రమేష్, పి ఈ టీ మణి ,ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలను ప్రారంభించిన సర్పంచ్ గర్దాసు విక్రమ్





**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 30:** ప్రభుత్వపాఠశాలలో ధాత రవ్వ నర్సింహా సహాకారం తో సుమారు 84500/-రూపాయలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా లను ప్రారంభించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి వార్డ్ మెంబెర్ లు వరికుప్పల స్వామి ,ప్రధానోపాధ్యాయులు, సింగణబోయిన గణేష్ యాదవ్ ,సింగణబోయిన శ్రీశైలం మందడి శ్రీధర్ రెడ్డి , రాజన్న రమేష్, గర్దాస్ వెంకటేష్ పద్మారావ్ , ఈర్లపల్లి మల్లయ్య , ఈర్లపల్లి రమేష్ , చిన్నపాక సురేష్, బోనగిరి సంజీవ వెలకుర్తి జానాచారి బాజ నరేందర్ మర్రి మహేష్ సింగణబోయిన మల్లేష్, కాటపల్లి మహేష్, శివగల్ల జ్ఞానేశ్వర్ , నక్క వెంకటేష్ , కంబాలపల్లి శ్రీశైలం రేపాక సత్తయ్య ,పుట్టల సాయికుమార్ , సింగణబోయిన సత్యనారాయణ నక్క వెంకటేష్ , వెలకుర్తి జానాచారి పాల్గొన్నారు.

# తెలంగాణ లెజెండ్ కేసీఆర్... ఆ ముద్రను ఎవరూ చెరపలేరు

**• కేసీఆర్‌పై కుట్రలు ఎంత చేసినా ప్రజలే గుణపాఠం చెబుతారు**

**• రాజకీయ కక్షసాధింపులు మానుకోండి.. లేకపోతే ప్రజా పోరాటం తప్పదు • గంగన్నగూడ టిఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం**



**తొలి అక్షరం/షాద్ నగర్,జనవరి 30:** తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన నాయకుడు, రాష్ట్ర ఆవిర్భావానికి మార్గదర్శకుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్)పై జరుగుతున్న చర్యలు పూర్తిగా రాజకీయ వేధింపులేనని గంగన్నగూడ బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే చర్యగా ఆయన అభివర్ణించారు.తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన నాయకుడిపై ఇలాంటి విచారణలు ప్రారంభించడం వెనుక రాజకీయ కుట్ర కక్షసాధింపే ఉన్నదని ఆయన ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష నేతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థల దుర్వినియోగానికి నిదర్శనమని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం చావు అంచులలో అడుగు పెట్టి నిరాహార దీక్షలు, పోరాటాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన నాయకుడే కేసీఆర్ అని గుర్తుచేశారు. అలాంటి నాయకుడిని ప్రజల్లో దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఈ నోటీసులు జారీ చేస్తున్నారని పవన్ కళ్యాణ్ అన్నారు.ఒక రాష్ట్ర పునర్నిర్మాతను రాజకీయంగా బలహీనపరచాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు సహించారని, కెసిఆర్ పై జరుగుతున్న పరిణామాలు ప్రతి ఒక్కరు గమనిస్తున్నారని, కెసిఆర్ పై కుట్రలు చేసే వారిపై ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఈ సందర్భంగా తెలిపారు. సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాల్లో కేసీఆర్ కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు, రైతు భీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళితబంధు వంటి సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. ఇలాంటి నోటీసులతో ఆయన ప్రజాదరణను తగ్గించడం అసాధ్యమని చెప్పారు.ప్రజల మద్దతే కేసీఆర్ అసలైన బలమని పేర్కొన్నారు.ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. పాలకులు అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా కక్షసాధింపులకు దిగడం బాధాకరమన్నారు.పోరాటానికి సిద్ధంమున్సిపల్ ఎన్నికల సమయంలో ఇలాంటి దిగజారుడు చర్యలు కొనసాగితే గ్రామస్థాయిలోనే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.ప్రజా నాయకుడిపై దాడి అంటే ప్రజలపై దాడి చేసినట్టే. అవసరమైతే రోడ్డెక్కి పోరాడతామని స్పష్టం చేశారు.

# ఘనంగా ప్రారంభమైన 'సీఎం కప్ - 2026' క్రీడా సంబరాలు

**• యువతకు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ముఖ్యం: సర్పంచ్ ఆర్రూరి నరేష్!**



**తొలి అక్షరం/మాడుగులపల్లి/జనవరి:30:** గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి, వారిని అంతర్జాతీయ స్థాయి చాంపియన్లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సీఎం కప్ - 2026' పోటీలు శుక్రవారం మండలంలోని సెవెంత్ డే స్కూల్లో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో స్థానిక ఎంపీడీవో వంశీధర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల గ్రామ సర్పంచి ఆర్రూరి నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు యువతకు శారీరక దృఢత్వాన్ని, క్రమశిక్షణను ఇస్తాయి. గ్రామీణ క్రీడాకారులు ఈ వేదికను ఉపయోగించుకుని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు అని అన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన గ్రామాలకు బహుమతులు అందజేత. బాయ్స్ కబడ్డీ పోటీలో ప్రథమ బహుమతి మాడుగులపల్లి, ద్వితీయ బహుమతి ఆగమోత్కూర్, (కోకో) ప్రథమ బహుమతి ఆగమోత్కూర్, ద్వితీయ బహుమతి పాములపాడు, (వాలీబాల్) ప్రథమ బహుమతి సెవెంత్ డే స్కూల్, ద్వితీయ బహుమతి ఆగమొత్కూర్, (గర్ల్స్ కబడ్డీ) మొదటి బహుమతి పాములపాడు, రెండవ బహుమతి సెవెంత్ డే స్కూల్, (కోకో) ప్రథమ బహుమతి కన్నెకల్, ద్వితీయ బహుమతి మాడుగులపల్లి, (వాలీబాల్) ప్రథమ బహుమతి కన్నెకల్, ద్వితీయ బహుమతి ఆగమొత్కూర్. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సరోజన పావని, ఎంపీ ఓ సంగీత, పంచాయతీ సెక్రెటరీ ఎస్. కె కాశీం, క్రీడాకారు తదితరులకు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో 244 నామినేషన్లు

**• కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్య పోటాపోటీ...**




**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 30:** షాద్‌నగర్ పురపాలక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది.మూడు రోజుల్లో మొత్తం 244 నామినేషన్లు దాఖలయ్యాయి.చివరి రోజు మాత్రమే 147 మంది అభ్యర్థులు 180 నామినేషన్లు సమర్పించారు. పార్టీల వారీగా చూస్తే కాంగ్రెస్ 84, బీఆర్ఎస్ 86, బీజేపీ 39, బీఎస్పీ 1, సీపీఎం 2, ఎంఐఎం 4, ఇతర పార్టీలు 4, ఇండిపెండెంట్లు 24 నామినేషన్లు దాఖలయ్యాయి.టిడిపి, వైఎస్సార్‌సీపీ, ఆప్ నుంచి ఒక్క నామినేషన్ కూడా లేకపోవడం గమనార్హం.ఒక్కో వార్డులో ఒకే పార్టీ నుంచి పలువురు నామినేషన్లు వేయడంతో అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్, బీఆర్ఎస్ అగ్రనేతలు తల పట్టుకుంటున్నారు. 12, 15వ వార్డుల్లో 13 చొప్పున అత్యధిక నామినేషన్లు నమోదయ్యాయి.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహారం అమలు చేస్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**• ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తే రాష్ట్రవ్యాప్తంగా అమలు • మొగిలిగిద్ద జెడ్పీహెచ్ఎస్ 150వ వార్షికోత్సవంలో డిప్యూటీ సీఎం వ్యాఖ్యలు**

**• భూసంస్కరణలకు ఆధ్యుడు బూర్గుల రామకృష్ణారావు**





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 30:** ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం అందించే పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్ కేబినెట్ ఆలోచన చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.ఎదిగే వయసులో సరైన పోషకాహారం లేకపోవడం వల్ల పిల్లలు సంపూర్ణంగా ఎదగలేకపోతున్నారన్న ఆలోచనతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం వైపు ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో అల్పాహార పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని, వనరులు సమకూరితే తప్పకుండా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.కామన్ స్కూల్ విధానం అమలైతే చిన్ననాటి నుంచే కులం, మతం, ధనిక పేద తేడాలు లేని భావన పిల్లల్లో పెరుగుతుందని, అదే సమాజాన్ని ఉమ్మడి కుటుంబంగా తీర్చిదిద్దుతుందని తెలిపారు.ఈ లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒక్కో పాఠశాలను 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో ఒకేసారి నిర్మాణాలు ప్రారంభించామని వివరించారు.ప్రపంచంతో పోటీ పడాలంటే తెలంగాణకు నాణ్యమైన మానవ వనరులు అవసరమని, మానవ వనరులపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం ఆర్థికంగా బలపడుతుందని భట్టి విక్రమార్క అన్నారు.అందుకే ఉచిత విద్య, ఉచిత వైద్యాన్ని ప్రజా ప్రభుత్వం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుందని చెప్పారు.ఈ క్రమంలోనే గత ఏడాది జనవరిలో సీఎం రేవంత్ రెడ్డి మొగిలిగిద్ద పాఠశాలను సందర్శించి రూ.10 కోట్లు మంజూరు చేయగా, ఆ నిధులతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.మారుతున్న కాలానికి అనుగుణంగా ఐటీఐల్లో ఆధునిక శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టామని,పారిశ్రామికవేత్తల సహకారంతో ఉపాధికి అనుగుణమైన సిలబస్ రూపొందించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లోనే డైట్, కాస్మొటిక్ ఛార్జీల పెంపుతో పాటు మహిళల కోసం వడ్డీ లేని రుణాలను అమలు చేశామని తెలిపారు.తొలి ఏడాదిలో రూ.26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించి ఇది సాధ్యమని నిరూపించామని చెప్పారు. మహిళలను 'మహాలక్ష్ములు'గా గౌరవిస్తూ నాణ్యమైన చీరలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నామని వివరించారు.దేశంలో భూసంస్కరణలకు ఆధ్యుడు బూర్గుల రామకృష్ణారావు అని పేర్కొన్న భట్టి విక్రమార్క,195054 మధ్య హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన కౌలు చట్టాన్ని తీసుకువచ్చి సాగుదారులకు భూమిపై హక్కులు కల్పించారని గుర్తు చేశారు. జాగీర్దారీ వ్యవస్థ, వెట్టి చాకిరి నుంచి ప్రజలను విముక్తి చేసిన మహానేతగా బూర్గుల నిలిచారని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలకు పరిష్కారం చూపిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచారని అన్నారు.150 ఏళ్ల చరిత్ర కలిగిన మొగిలిగిద్ద పాఠశాల 1952 వరకు ఉర్దూ మీడియంగా కొనసాగి, అనంతరం తెలుగు మీడియాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు.2008లో దివంగత సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని తప్పనిసరిగా ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లీష్ విద్య ఉపాధికి కీలకమని వైయస్ అప్పుడే గుర్తించారని భట్టి విక్రమార్క అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రొఫెసర్ హరగోపాల్, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ కృష్ణయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బండారి సంతోష, జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# 1వ వార్డ్ కౌన్సిలర్ బరిలోకి ఎంఐఎం గౌస్

**• ఎట్టి పరిస్థితుల్లో గెలిపించుకొని తీరుతాం: కాలనీవాసులు వెల్లడి**

**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 30:** షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 1వ వార్డు కౌన్సిలర్ స్థానానికి ఎంఐఎం పార్టీ తరపున గౌస్ బరిలోకి దిగారు. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ గౌస్‌ను 1వ వార్డు కౌన్సిలర్‌గా గెలిపించుకుని తీరుతామని అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు ఏకస్వరంగా శపథం చేస్తున్నారు. గతంలో గౌస్ నిర్వహించిన సేవలే ఈ ఎన్నికల్లో ఆయనకు ప్రధాన బలంగా మారుతున్నాయని కాలనీవాసులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి గడప వద్దా గౌస్ పాలనతోనే సుపరిపాలన సాధ్యమనే నమ్మకం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. వార్డు అభివృద్ధి విషయంలో ఆయన చూపిన నిబద్ధత, ప్రజలతో నేరుగా మమేకమయ్యే తత్వం, సమస్యలపై తక్షణ స్పందన ప్రజల ఆదరణను పొందుతున్నాయి. రాజకీయ అనుభవం, దూరదృష్టితో కూడిన ఆలోచనలతో గౌస్ ఒక సమర్థవంతమైన నాయకుడిగా గుర్తింపు పొందారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. గతంలో మాజీ కౌన్సిలర్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశారని గుర్తు చేస్తున్నారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో మరోసారి అవకాశం ఇస్తే, ప్రజా సేవతోనే మీ రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు అనేవి నిరంతరం ఉత్పన్నమవుతూనే ఉంటాయని, ఒక సమస్య పరిష్కారం అయిన వెంటనే మరో కొత్త సమస్య ముందుకొస్తుందని ఆయన పేర్కొన్నారు. గతంలో అనేక సమస్యలను పరిష్కరించినప్పటికీ, కొత్త సమస్యలు పునరావృతమవుతూనే ఉన్నాయని తన అనుభవాన్ని వెల్లడించారు. అయితే సమస్యలు ఎంత ఉన్నా వెనకడుగు వేయకుండా ప్రజలతో కలిసి పరిష్కార మార్గాలను అన్వేషించడమే తన రాజకీయ లక్ష్యమని గౌస్ స్పష్టం చేశారు. వార్డు అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకే ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తానని హామీ ఇచ్చారు. ఆయన సేవా నేపథ్యం, పరిపాలనా




అనుభవం, ప్రజలతో ఉన్న బలమైన అనుబంధమే గౌస్‌కు ఈ ఎన్నికల్లో ప్రధాన బలంగా మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 1వ వార్డులో పోటీ ఆసక్తికరంగా మారగా గౌస్‌పై ప్రజల్లో ఉన్న నమ్మకమే ఆయన గెలుపును నిర్ణయించనుందన్న చర్చ జోరుగా సాగుతోంది.

# మీ అక్షరాలు అన్యాయంపై ఆయుధాలుగా మారి నిర్భయంగా ప్రశ్నించాలి: సర్పంచ్ ఆర్ బాబు నాయక్

**జాతీయ సమైక్యత పురస్కారం గ్రహీత జర్నలిస్టు శంకర్‌కు ఘన సన్మానం**

**గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ , ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో ఘన సత్కారం**

**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 30:** ఫరూక్‌నగర్ మండలం వెలి జర్ల గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, రచయిత శంకర్ జాతీయ సమైక్యత ఉత్తమ పురస్కారం అందుకోవడం గ్రామానికి గర్వకారణంగా ఉందని గ్రామ సర్పంచ్ ఆర్ బాబు నాయక్ అన్నారు. గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్ ఆధ్వర్యంలో వెలి జర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఉప సర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు కలిసి జర్నలిస్టు, రచయిత శంకర్‌కు శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి ఘనంగా అభినందించారు. జర్నలిజం, రచనా రంగాల్లో శంకర్ కనబరిచిన ప్రతిభ, సమాజ సమస్యలపై ఆయన చూపిన నిబద్ధతను వారు ప్రశంసించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాబు నాయక్ మాట్లాడుతూ రచయితగా, జర్నలిస్టుగా జాతీయ స్థాయి అవార్డులు అందుకోవడం వెలి జర్ల గ్రామానికి గర్వకారణం.



శంకర్ కలం సమాజంలో మంచి మార్పుకు దారి చూపుతోంది. యువతను ఆలోచింపజేసేలా, ప్రజల్లో చైతన్యం నింపేలా ఆయన రచనలు ఉండటం అభినందనీయము. భవిష్యత్తులో మరింత బాధ్యతతో ప్రజా సమస్యలపై స్పందిస్తూ...యువతకు ఆదర్శంగా నిలవాలి అని ఆకాంక్షించారు. ఉపసర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలను చైతన్యపరిచే శక్తివంతమైన వేదిక. ప్రజాస్వామ్య పునాదులైన పరిపాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, ఎన్నికల వ్యవస్థలు నిష్పక్షపాతంగా, సమర్థవంతంగా పనిచేస్తున్నాయా లేదా అన్నదాన్ని నిరంతరం గమనిస్తూ, తప్పుదారి పట్టినప్పుడు తట్టి లేపే బాధ్యత మీడియాపైనే ఉంటుంది. వ్యవస్థలు నిద్రావస్థలోకి జారుకున్నప్పుడు ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే ధైర్యం చూపించేది మీడియానే. అన్యాయాన్ని వెలుగులోకి తీసుకురావడం, అవినీతిని ఎండగట్టడం, సామాన్యుడి సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని జీవంతంగా ఉంచుతుంది. ఈ క్రమంలో నిజాయితీగల జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం. వ్యక్తిగత లాభాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా, సమాజ హితం కోసమే కలం కదిలే జర్నలిస్టులే ప్రజాస్వామ్యానికి నిజమైన కాపలాదారులు. వారి అక్షరాలు ప్రజల్లో చైతన్యం నింపి, మార్పుకు బాటలు వేస్తాయి. ప్రజల నమ్మకమే మీడియాకు అసలైన బలం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, సత్యం వైపు నిలిచినప్పుడే మీడియా ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షకుడిగా నిలుస్తుందన్నారు. సన్మానం అనంతరం జర్నలిస్టు శంకర్ స్పందిస్తూ ఈ సత్కారం తనపై మరింత బాధ్యతను పెంచింది. సమాజ హితం కోసం నిజాయితీగా పనిచేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి తన రచనలు అంకితం చేస్తాను. ప్రజల పక్షాన నా కలంతో నిరంతరం గళం వినిపిస్తాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాత్లవత్ వెంకటేష్, రమేష్, దేవేందర్, వడ్ల ఆచారి, గ్రామస్తులు మంగలి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం





**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 30:** రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగినది ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్ర రవీందర్ రెడ్డి హాజరై గ్రామ ప్రజలను చల్లగా చూడాలని మల్లికార్జున స్వామిని వేడుకున్నారు

## శ్రీ బోయకొండ గంగమ్మను దర్శించుకున్న డీఐజీ,కోయ ప్రవీణ్

**తొలి అక్షరం/అన్నమయ్య జిల్లా జనవరి 30:** పుంగనూరునియోజకవర్గం చౌడేపల్లి మండలం దిగువపల్లి గ్రామం వద్ద వెలసి ఉండు భక్తుల కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి విరాజిల్లుతున్న శ్రీ బోయకొండ గంగమ్మ అమ్మవారిని కర్నూలు రేంజ్ డీఐజీ కోయా ప్రవీణ్ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనను ఆలయ ఈవో ఏకాంబరం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు కల్పించారు. అనంతరం అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలు జ్ఞాపికను అందజేశారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, మదనపల్లి డి.ఎస్.పి మహేంద్ర సిఐలు సుబ్బరాయుడు, సాయి ప్రసాద్, ఎస్సై నాగేశ్వరరావు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిజెపికి మద్దతు నిలవండి-మున్సిపాలిటీల అభివృద్ధికి పాటుపడండి..



**బిజెపి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్..**

**బిజెపి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి- షాద్ నగర్ మున్సిపాలిటీని అభివృద్ధి వైపు నడపండి..**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి..**

**బిజెపి అభ్యర్థుల నామినేషన్ ర్యాలీ..**

**భారీగా తరలి వచ్చిన బిజెపి శ్రేణులు..**

**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 30:** మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా షాద్ నగర్ మున్సిపాలిటీలో బిజెపి అభ్యర్థుల నామినేషన్ ర్యాలీ భారీగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బిజెపి జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ , బిజెపి రాష్ట్ర నాయకులు ప్రకాష్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య గారు, దేపల్లి అశోక్ గౌడ్, వెంకటేష్ గుప్త, మహేందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, అముదాపురం నర్సింహా, ప్యాట అశోక్, వంశీ కృష్ణ, హరి భూషణ్, మల్చలం మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్ భూపాల్ మాట్లాడుతూ...గత ప్రభుత్వాలు అబద్ధపు హామీలతో ప్రజలను పూర్తిగా మోసం చేసారని మండిపడ్డారు. మున్సిపాలిటీల అభివృద్ధి లో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. గత పదకొండు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి, మున్సిపాలిటీ అభివృద్ధి కి సహకరించండి అని అన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూమున్సిపాలిటీల అభివృద్ధి బిజెపి తోనే సాధ్యమని, గత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో వైఫల్యం చెందాయని అన్నారు. నిరుద్యోగ యువత ను, మహిళలను, కార్మికులను, బడుగు బలహీన వర్గాల ప్రజలను మోసం చేసిన పార్టీలు కాంగ్రెస్ బీఆర్ఎస్ అని అన్నారు. ఆ రెండు పార్టీలు ఒకటేనని, ఆ రెండు పార్టీ లను ప్రజలు నమ్మవద్దని, ప్రజలు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించి, షాద్ నగర్ మున్సిపాలిటీని అభివృద్ధి పదం లో నడపాలని కోరారు. ఈ సందర్భంగా అందె బాబయ్య మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధి యే బిజెపి లక్ష్యమని, మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి వికసిత్ భారత్ లో మన వంతు కృషి చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమం బోయ కురుమయ్య, మోటె శ్రీనివాస్, ఎన్ ప్రవీణ, ఎంకనోళ్ల వెంకటేష్, విట్యాల నర్సింలు, బిజెపి మండల అధ్యక్షులు చిట్యాం లక్ష్మీకాంత్ రెడ్డి, పిట్టల సురేష్, రొల్లు రాధిక, పోటీ చేసే అభ్యర్థులు కార్యకర్తలు ప్రజలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం..







**తొలి అక్షరం/కరీంనగర్ టౌన్ జనవరి 30:** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ అలంను తురుకోడా అని దూషించిన అంశాన్ని తీవ్రంగా ఖండిస్తూ నగరంలోని హౌసింగ్ బోర్డ్ చౌరస్తా లో హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను ఎంఐఎం పార్టీ కార్యకర్తలు నాయకులు శుక్రవారం రాత్రి దగ్ధం చేశారు. కౌశిక్ రెడ్డి డౌన్ డౌన్ ఖబర్దార్ కౌశిక్ రెడ్డి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం నాయకులు మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని లేకుంటే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో తిరగనివ్వమని, ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఒకవైపు బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ గంగా జమున తెహజీబ్ను కాపాడాలని చెబుతుంటే మరోవైపు కౌశిక్ రెడ్డి కేసిఆర్ ఆశయాలను తుంగలో తొక్కి, ముస్లింలను తురుకోడా అని సంబోధించడం రాజకీయ అవివేకానికి నిదర్శనమని అభివర్ణించారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండిపోయే కౌశిక్ రెడ్డి, 40 సంవత్సరాలు దేశం కోసం సేవ చేసే ఐపీఎస్ ను అసభ్య పదాజాలంతో దూషించడం సరికాదన్నారు. కౌశిక్ రెడ్డికి రాజకీయ పరిపక్వత లేదని కేవలం నోటి దురుసుతో రాజకీయ జీవితం తనంతట తానే నాశనం చేసుకుంటూ బిఆర్ఎస్ పార్టీని ముస్లిం సమాజంలో అభాసపాలు చేస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా కేసీఆర్, కేటీఆర్ లు స్పందించి కౌశిక్ రెడ్డి పై పార్టీ పరమైన చర్యలను తీసుకోవాలని, క్షమాపణ చెప్పించాలని భవిష్యత్తులో కౌశిక్ రెడ్డి ఏ కులాన్ని, మతాన్ని కించపరచకుండా నోటిని అదుపులో ఉండేట్లు జాగ్రత్తలు చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లిం సమాజానికి, సిపి గౌస్ ఆలం కు, కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పకుంటే కరీంనగర్లో కౌశిక్ రెడ్డి ఎక్కడ అడుగుపెట్టిన తన్ని తరుముతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు, ఎండి రఫీ, ఖాజా మొయినుద్దీన్, , ఖమరొద్దీన్ షబ్బీర్, ఎండి రఫీ, నిజం, ఆయుబ్ అలీ, మిస్కిన్, ఇలియాజ్, ఇర్ఫాన్, సయ్యద్, ఖాజా, అల్తాఫ్, ముజ్జు, జబ్బార్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# పాలన అంటే శబ్దం కాదు..
# ప్రజల గుండె చప్పుడు

- నినాదాల కంటే ఫలితాలే ముఖ్యం
- ఉచిత పథకాలతో స్వావలంబన సాధ్యమా?
- వ్యవస్థల బలోపేతమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష
- టివైజెఎఫ్ అధ్యక్షులు,సీనియర్ సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జితేందర్ రావు తనుగుల

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జనవరి30:** పాలన అనేది కేవలం అధికార ప్రదర్శనో లేక ఆకర్షణీయమైన నినాదాల హోరో కాదని అది ప్రజల జీవితాల్లో తెచ్చే మార్పు మాత్రమేనని తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సీనియర్ కరస్పాండెంట్, ది సౌత్ ఇండియన్ టైమ్స్ సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జితేందర్ రావు తనుగుల స్పష్టం చేశారు. 2026 నాటికి భారత్‌లో పాలనపై ప్రజల అంచనాలు భారీగా పెరిగినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు వస్తున్నాయా అన్నది చర్చనీయాంశంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. నేటి పాలనలో పెరిగిన 'శబ్దం' (ప్రచారం) కంటే ప్రజల 'గుండె చప్పుడు' వినడం పాలకులకు అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. **ప్రచారం మెండు.. పని తక్కువ?:** ప్రస్తుత రోజుల్లో పాలన సోషల్ మీడియా వేదికగా, భారీ ప్రకటనలకే పరిమితమవుతోందని జితేందర్ రావు విమర్శించారు.కేవలం పథకాల ప్రకటనలు, ఆకర్షణీయమైన నినాదాలు పాలనకు ప్రత్యామ్నాయం కాబోవని, ప్రజలు మాటల కంటే మార్పునే కోరుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. **సంక్షేమం పేరుతో పరాధీనత వద్దు** సంక్షేమ పథకాలు ప్రజాస్వామ్యానికి అవసరమే అయినప్పటికీ, అవి కేవలం రాజకీయ ఆయుధాలుగా మారడం ఆర్థిక వ్యవస్థకు గొడ్డలిపెట్టు అని ఆయన విశ్లేషించారు.**స్వావలంబన దిశగా:** ప్రజలను పథకాలపై ఆధారపడేలా చేయడం కంటే, వారిని ఆర్థికంగా స్వయం సమృద్ధి వైపు నడిపించడమే నిజమైన పాలన. **ఆర్థిక భారం:** ఉచిత పథకాల రాజకీయాలు తాత్కాలికంగా ఓట్లు కురిపించవచ్చు కానీ, దీర్ఘకాలంలో దేశ ఆర్థిక పటిష్టతను దెబ్బతీస్తాయని హెచ్చరించారు. **బలహీనపడుతున్న వ్యవస్థలు** పార్లమెంట్, న్యాయవ్యవస్థ, మీడియా వంటి రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రత దెబ్బతింటే అది మొత్తం ప్రజాస్వామ్యానికే ప్రమాదమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సంస్థల బలం లేని పాలన కేవలం పేకమేడలాంటిదని, పాలకులు వీటిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం వల్ల ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతోందని వివరించారు. **డిజిటల్ పాలన:** నాణేనికి రెండు పార్శ్వాలు సాంకేతికత వినియోగం పెరగడం వల్ల సేవలు వేగవంతమైనప్పటికీ, డేటా గోప్యత మరియు డిజిటల్ పరిజ్ఞానం లేని పేద వర్గాల విస్మరణ వంటి సవాళ్లు వెంటాడుతున్నాయని జితేందర్ రావు తెలిపారు. సాంకేతికత ప్రజలకు సాధనంగా ఉండాలి తప్ప, అదొక భారంగా మారకూడదని స్పష్టం చేశారు.**నైతికతతోనే గుర్తింపు:** అవినీతి రహితం, పారదర్శకత లేని ఏ ప్రభుత్వమైనా ప్రజల మన్ననలను కోల్పోతుందని, పాలన అనేది ఒక నైతిక బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. "నేటి పౌరుడు మౌనంగా ఉండడు ప్రశ్నిస్తాడు. ప్రజల గుండె చప్పుడు వినని పాలన ఎప్పటికైనా ఆగ్రహంగా మారుతుంది అని ఆయన పేర్కొన్నారు.



# చెంగిచెర్లలో వరుస చోరీలు

- అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు
- ఢిల్లీ, యూపీ, బిహార్‌కు చెందిన నలుగురు నిందితుల పట్టివేత
- పదిహేను రోజుల్లోనే కేసు ఛేదించిన మెడిపల్లి పోలీసులు
- నిందితుల నుంచి రూ. 2.04 లక్షల నగదు స్వాధీనం



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జనవరి30:** మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంగిచెర్లలో వరుసగా ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను రాచకొండ కమిషనరేట్ పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు దొంగలతో పాటు, దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన రిసీవర్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. **ఒకే రాత్రి తొమ్మిది ఇళ్లలో కన్నం:** పోలీసుల కథనం ప్రకారం..ఈ నెల 15, 16వ తేదీల మధ్య రాత్రి చెంగిచెర్లలోని కనకదుర్గ కాలనీలో ఈ ముఠా బీభత్సం సృష్టించింది.తాళం వేసి ఉన్న వరుసగా తొమ్మిది ఇళ్లను లక్ష్యంగా చేసుకుని లోపలికి ప్రవేశించి బంగారం,వెండి ఆభరణాలతో పాటు నగదును దోచుకెళ్లారు.దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు మెడిపల్లి పోలీసులు నాలుగు వేర్వేరు కేసులు నమోదు చేశారు. **సాంకేతిక ఆధారాలతో వేట:** వరుస చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో.. మల్కాజ్‌గిరి సీసీఎస్,ఉప్పల్ సీసీఎస్, మెడిపల్లి పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. సీసీటీవీ ఫుటేజీలు, సెల్ టవర్ సిగ్నల్స్, సాంకేతిక ఆధారాల సాయంతో నిందితులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా గుర్తించారు.రంగంలోకి దిగిన పోలీసులు బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో గాలించి నిందితులను పట్టుకున్నారు. నేర చరిత్ర కలిగిన ముఠా అరెస్ట్ అయిన నిందితులకు పాత నేర చరిత్ర ఉంది.

వీరు గతంలో ఢిల్లీతో పాటు తెలంగాణలోని జనగామ, వరంగల్, నల్గొండ జిల్లాల్లోనూ పలు దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలింది. వీరి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, రూ. 2.04 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాన్సిట్ వారెంట్‌పై నిందితులను ఇక్కడికి తరలించి రిమాండ్‌కు పంపారు. అత్యంత ప్రతిభావంతంగా కేసును ఛేదించిన పోలీసు బృందాలను ఉన్నతాధికారులు అభినందించారు.దొంగిలించబడిన బంగారం , వెండి రికవరీకి సంబంధించిన పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

# నేడు బోడుప్పల్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేత

- బోడుప్పల్ ఏఈ ఎన్.వేణుగోపాల్




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జనవరి30:** విద్యుత్ మరమ్మతులు,కొత్త సర్వీసుల కనెక్షన్ల నేపథ్యంలో శనివారం (జనవరి 31) బోడుప్పల్ పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బోడుప్పల్ ఏఈ ఎన్.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. **ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు:** ఇందిరానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎస్‌బీఆర్ కాలనీ ఫీడర్ కింద ఉన్న పద్మావతి కాలనీ, అమ్మాసాని వెంకటరెడ్డి కాలనీ, ఆర్.ఎన్.ఎస్ కాలనీ, ఎస్‌బీఆర్ కాలనీ, బీఎల్ నగర్, అంజయ్య ఎంక్లేవ్, టెలిఫోన్ కాలనీ ఫేజ్-2, పీఎన్ఆర్ కాలనీ, రెడ్డీస్ కాలనీ, భవానీ కాలనీ, సుభోదయ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, గ్రీన్ సిటీ నగర్, అనగపురి కాలనీ, భీమ్ రెడ్డి కాలనీ, ఎన్ఐఎన్ కాలనీలలో సరఫరా నిలిచిపోతుంది. **ఉదయం 11 నుంచి 11.30 వరకు:** బోడుప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ కింద ఉన్న రాఘవేంద్ర కాలనీ, బృందావన్ కాలనీ, సాయి మారుతీ నగర్, ఉదయ లక్ష్మి నగర్, సిద్ధార్థ స్కూల్ (బోడుప్పల్ మెయిన్ రోడ్), ఆకృతి టౌన్‌షిప్, కేశవ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు.

# మద్ది మేడారం జాతరలో వైద్య సేవలు



- 268 మంది భక్తులకు చికిత్స
- కుష్ఠ వ్యాధిపై అవగాహన'స్పర్శ్' ప్రతిజ్ఞ
- ఇంటింటి సర్వే ద్వారా బాధితుల గుర్తింపు

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జనవరి30:** మద్ది మేడారం (నాగరాజ్‌పల్లి)లో జరుగుతున్న శ్రీ శ్రీ సమ్మక్క-సారక్క జాతరలో భక్తులకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా సేవలు అందుతున్నాయి. మేడపల్లి ట్రైబల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులో ఇప్పటివరకు 268 మందికి చికిత్సలు అందించినట్లు వైద్యాధికారిణి డాక్టర్ జ్యోతి వెల్లడించారు. **కుష్ఠ రహిత సమాజమే లక్ష్యం:** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ మాస్ మీడియా అధికారి అనిల్ కుమార్ ఈదురు శుక్రవారం క్యాంపును పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి 'స్పర్శ్' ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుష్ఠ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.చర్మంపై స్పర్శలేని మచ్చలు, నొప్పిలేని బొడిపెలు, కనురెప్పలు మూసుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.నేటి నుంచి ఫిబ్రవరి 13 వరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, లక్షణాలు ఉన్నవారిని గుర్తించి ఉచితంగా చికిత్స అందిస్తారని తెలిపారు. **మానవత్వంతో సేవ చేయాలి:** ఎంపీడీఓ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సంపేట ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కుష్ఠ వ్యాధిగ్రస్తులను చిన్నచూపు చూడకుండా, వారిని కుటుంబ సభ్యుల్లా ఆదరించాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నిరంతరం సేవలందిస్తున్న వైద్య, ఐసీడీఎస్ సిబ్బంది తీరును ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ మధు, ఆరోగ్య విద్యా బోధకురాలు వసంత, సూపర్‌వైజర్లు కనకలక్ష్మి, అరుణ, ఆరోగ్య కార్యకర్తలు సుమలత, అనిత, ఆశా కార్యకర్తలు సుకన్య, రజిత, అంగన్‌వాడీ టీచర్లు, మండల ప్రెసిడెంట్ వెంకటలక్ష్మిలు పాల్గొన్నారు.

# మీరు హామీ ఇవ్వండి.. నెరవేర్చే బాధ్యత నాది..!

- ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల సమావేశంలో మంత్రి పొంగులేటి




**తొలి అక్షరం/పాలేరు, జనవరి 30 :** "వార్డుల్లోకి వెళ్ళండి.. జనం సమస్యలను గుండెలకు హత్తుకోండి.. పరిష్కరిస్తామని గట్టిగా హామీ ఇవ్వండి.. వాటిని నెరవేర్చే బాధ్యత తనది" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏదులాపురం అభ్యర్థులకు స్పష్టం చేశారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో 32 వార్డుల అభ్యర్థులు, ఇన్-చార్జులతో శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా సమావేశం నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ... మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటే, ఏదులాపురం రూపురేఖలను మారుస్తానని మంత్రి చెప్పారు. అభివృద్ధిలో ఏదులాపురాన్ని రాష్ట్రానికే ఒక దిక్సూచిగా, ఆదర్శ మున్సిపాలిటీగా నిలబెట్టే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఏదులాపురాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రచారంలో భాగంగా ప్రతి వార్డులోనూ తాను స్వయంగా పర్యటించి ప్రచారం నిర్వహిస్తానని వెల్లడించారు. ప్రత్యర్థుల ఎత్తుగడలను చిత్తు చేస్తూ, దూకుడుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వార్డు, జోనల్ ఇన్-చార్జులు, అభ్యర్థులు సమన్వయంతో ప్రతి ఓటరును కలిసి కాంగ్రెస్ వైపు తిప్పుకోవాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూనే, అభివృద్ధి పట్ల వారికున్న నిబద్ధతను చాటిచెప్పాలన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని మంత్రి పొంగులేటి దిశానిర్దేశం చేశారు.

# రోహిత్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టిన పాల్ స్టిర్లింగ్




టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, టీ20 ఫార్మాట్‌లో చాలా రికార్డులే క్రియేట్ చేశాడు. వీటిలో కొన్ని ఇప్పటికీ చెక్కు చెదరలేదు. అయితే హిట్‌మ్యాన్ ఇంటర్నేషనల్ టీ20ల నుంచి రిటైర్ అయిన దాదాపు రెండు సంవత్సరాల తర్వాత.. ఓ రికార్డు బద్ధలైంది. షార్ట్ ఫార్మాట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా రోహిత్ గతంలో హిస్టరీ క్రియేట్ చేయగా, ఇప్పుడు ఆ రికార్డును ఐర్లాండ్ కెప్టెన్, ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ బ్రేక్ చేశాడు. 2007లో అరంగేట్రం చేసిన రోహిత్, 2024 టీ20 ప్రపంచ కప్ గెలిచాక రిటైర్మెంట్ అనౌన్స్ చేశాడు. కెరీర్‌లో మొత్తం 159 ఇంటర్నేషనల్ టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మైల్‌స్టోన్ చేరుకోవడానికి రోహిత్‌కి 17 సంవత్సరాలు పట్టింది. అయితే నిన్న ఈ రికార్డును పాల్ స్టిర్లింగ్ బ్రేక్ చేసి.. కెరీర్‌లో 160వ ఇంటర్నేషనల్ టీ20 ఆడాడు. 2026 జనవరి 29న దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో యూఏఈ వర్సెస్ ఐర్లాండ్ మ్యాచ్.. పాల్ స్టిర్లింగ్ т20 కెరీర్‌లో 160వది. ఆసక్తికరంగా స్టిర్లింగ్ కూడా తన т20 కెరీర్‌లో 17వ సంవత్సరంలో ఉన్నాడు. రోహిత్ లాగానే, ఐర్లాండ్ టీమ్‌లో అతను ఇన్నింగ్స్ స్టార్ట్ చేస్తాడు. ప్రస్తుత సిరీస్‌లో యూఏఈతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఆ తర్వాత శ్రీలంకలో 2026 т20 ప్రపంచ కప్ స్టార్ట్ అవుతుంది. అంటే ఐర్లాండ్ వరుసగా టీ20 క్రికెట్ ఆడుతుంది. దీంతో స్టిర్లింగ్ రాబోయే నెలల్లో రోహిత్‌పై తన ఆధిక్యం పెంచుకునే అవకాశాలు స్టిర్లింగ్ ఇప్పుడు టాప్ ప్లేస్‌లో ఉన్నప్పటికీ, ఈ రికార్డు ఎక్కువ కాలం నిలవకపోవచ్చు. ఎందుకంటే ఇప్పుడు т20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు గతంలో కంటే చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. మిగతా రెండు ఫార్మాట్ల కంటే టీ20లు చూడటానికే ఫ్యాన్స్ ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ జనరేషన్ ప్లేయర్స్‌కి ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం దక్కుతుంది. పాకిస్తాన్‌కు చెందిన 31 ఏళ్ల బాబర్ ఆజం ఇప్పటికే 137 టీ20లు ఆడాడు. ఇండియన్ స్టార్ ఆల్‌రౌండర్ 32 ఏళ్ల హార్దిక్ పాండ్యా 128 మ్యాచ్‌లతో పోటీలో ఉన్నాడు. రాబోయే నెలల్లో వీరు ఈజీగా 150 మార్కును దాటే ఛాన్సులు ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్ (వంటి ప్లేయర్స్ రికార్డ్సుని చూస్తే టీ20లకు పాపులారిటీ ఏ రేంజ్‌లో ఉందో అర్థమవుతుంది. కేవలం ఐదు సంవత్సరాల్లోనే సూర్య 103 మ్యాచ్‌లు ఆడాడు. యావరేజ్‌గా సంవత్సరానికి 20 కంటే ఎక్కువ గేమ్‌లలో పాల్గొన్నాడు. ఇదే స్పీడ్ కంటిన్యూ అయితే, ఈ దశాబ్దం చివరి నాటికి ఒక ప్లేయర్ 200 మ్యాచ్‌లకు చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఉన్నాయి. అరుదైన రికార్డు అందుకున్న మ్యాచ్‌లో స్టిర్లింగ్ 8(3)కే అవుట్ అయ్యాడు. అయితే ఐర్లాండ్ 178 పరుగులు చేయగలిగింది. యూఏఈ ఛేజింగ్‌లో 121కే ఆలౌట్ అయింది. రెండో టీ20 మ్యాచ్ జనవరి 31న జరుగుతుంది.

# కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ మాయం..




టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ గురువారం (జనవరి 29న) రాత్రి అకస్మాత్తుగా మాయమైంది. అయితే తాను సోషల్ మీడియా నుంచి వెళ్లిపోతున్నాను లేదా కొంతకాలం దూరంగా ఉంటున్నాను అని ఎలాంటి పోస్ట్ చేయలేదు. దాంతో విరాట్ కోహ్లీ అభిమానులు ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్ మిస్ కావడంపై ఆశ్చర్యపోయారు. క్రికెటర్ కోహ్లీనే తన అకౌంట్ డిలీట్ చేశాడా లేదా ఏదైనా కారణాలతో జరిగిందా అని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్ల పరంగా చూస్తే క్రికెటర్లలో విరాట్ కోహ్లీనే నెంబర్ వన్. ప్రపంచంలో అత్యధిక ఫాలోవర్లు ఉన్న ఆటగాళ్లలో కోహ్లీ ఒకడు. ఇన్‌స్టాగ్రామ్‌లో కోహ్లీకి 274 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. తాజాగా కోహ్లీ అభిమానులు అతని ఇన్‌స్టా అకౌంట్ సెర్చ్ చేయగా ఏమీ కనిపించడం లేదు. అసలేం జరిగింది అని కింగ్ కోహ్లీ ఫ్యాన్స్ ఆలోచిస్తున్నారు. విరాట్ కోహ్లీ ప్రస్తుతం తన కుటుంబంతో కలిసి లండన్‌లో నివాసం ఉంటున్నాడు. కోహ్లీ, అనుష్క శర్మ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అతను టెస్ట్, టీ20 ఫార్మాట్ల నుండి రిటైర్ అయ్యాడు. కోహ్లీ కేవలం వన్డేల్లో మాత్రమే టీమిండియా తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ కోసం కోహ్లీ భారతదేశానికి వచ్చాడు, ఆ సిరీస్ ముగిసిన వెంటనే లండన్ తిరిగి వెళ్ళాడు. విరాట్ కోహ్లీ ఒక్క ఇన్‌స్టాగ్రామ్ పోస్టుకు కోట్లలో సంపాదిస్తారని తెలిసిందే. దాంతో కోహ్లీ సోషల్ మీడియా నుంచి బ్రేక్ తీసుకున్నాడా అని అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. అందుకు సంబంధించి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ స్క్రీన్‌షాట్‌లను షేర్ చేస్తున్నారు. విరాట్ కోహ్లీ సోదరుడు వికాస్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా కూడా కనిపించడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పుడు, ఇద్దరి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు ఏదైనా టెక్నికల్ ప్రాబ్లం కారణంగా కనిపంచడం లేదా, లేక వాళ్లే డీయాక్టివేట్ చేసుకున్నారా అనే ప్రశ్న తలెత్తుతుంది. త్వరలోనే దీనిపై కోహ్లీ స్పందించి పోస్ట్ చేసే అవకాశం ఉంది.

# ఓపెనర్‌గా సంజుకి అదిరిపోయే అవకాశం



వరల్డ్ క్రికెట్‌లో టీమ్‌ఇండియా బ్యాటర్లు ఈమధ్య పరుగుల వరద పారిస్తున్న విషయం తెలిసిందే. ఐపీఎల్ అయినా, అంతర్జాతీయ మ్యాచులు అయినా సెంచరీలతో విరుచుకుపడుతుంటారు. కానీ వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, టీ20 వరల్డ్ కప్ వేదికపై మాత్రం మనోళ్లు సెంచరీ కొట్టి 16 ఏళ్లు దాటిపోయింది. 2024లో మనం వరల్డ్ కప్ గెలిచినా, ఒక్కరు కూడా వంద మార్కును అందుకోలేకపోయారు. ఇప్పుడు 2026 మెగా టోర్నీకి సమయం దగ్గర పడింది. ఈ తరుణంలో మన యంగ్ బ్యాటర్లు రెండవ సెంచరీ రికార్డును అందుకుంటారా చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఒక టాలెంటెడ్ ప్లేయర్ పేరు ఇప్పుడు మారుమోగుతోంది. టీ20 వరల్డ్ కప్‌లో భారత్ తరఫున మొట్టమొదటి సెంచరీ సాధించిన రికార్డ్ సురేష్ రైనా పేరిట ఉంది. 2010లో సౌత్ ఆఫ్రికాపై ఆయన ఈ ఘనత సాధించారు. ఇప్పుడు మళ్లీ అదే రైనా, సంజు శాంసన్‌పై తన నమ్మకాన్ని ప్రకటించారు. "ఈ వరల్డ్ కప్‌లో సంజు సెంచరీ సాధించే అవకాశం ఉంది. అతను ఓపెనర్‌గా వస్తున్నాడు, పైగా కావాల్సిన టాలెంట్ ఉంది" అని రైనా పేర్కొన్నారు. ఇప్పటికే సౌత్‌ఆఫ్రికా గడ్డపై రెండు సెంచరీలు బాదిన అనుభవం సంజుకు ఉందని, అందుకే ఆ 16 ఏళ్ల కరవును తీరుస్తాడని రైనా బలంగా నమ్ముతున్నారు. ప్రస్తుతం సంజు శాంసన్ ఫామ్ కొంచెం ఆందోళన కలిగిస్తోంది. గత నాలుగు మ్యాచుల్లో అతను చేసిన స్కోర్లు 11, 10, 6, 0, 24 మాత్రమే. అయితే రైనా దీనిపై స్పందిస్తూ "ఫామ్ అనేది తాత్కాలికం, కానీ సంజు క్లాస్ ప్లేయర్. సూర్యకుమార్ యాదవ్ కూడా ఒక ఏడాది పాటు సరిగ్గా ఆడలేదు, కానీ కోచ్ ఆయనను నమ్మారు. సంజు విషయంలో కూడా అదే జరుగుతుంది" అని మద్దతుగా నిలిచారు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో సంజు ఇప్పటివరకు 56 మ్యాచ్‌ల్లో 1072 పరుగులు చేశారు. ఆయన స్ట్రైక్ రేట్ (147.86) కూడా టీ20 ఫార్మాట్‌కు తగ్గట్టుగా అద్భుతంగా ఉంది. వచ్చే వరల్డ్ కప్‌లో సంజు శాంసన్, అభిషేక్ శర్మ కలిసి ఓపెనింగ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీ20ల్లో ఓపెనర్‌గా రావడం అంటే ఎక్కువ బంతులు ఆడే ఛాన్స్ దక్కుతుంది. అదే జరిగితే సెంచరీ సాధించడం సంజుకు పెద్ద కష్టమేమీ కాదు. ఐపీఎల్‌లో కూడా ఆయన ఎన్నో మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడాడు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ లాంటి యంగ్ గన్స్ ఉన్నా, సంజు తన అనుభవంతో ఈసారి హిస్టరీ క్రియేట్ చేస్తాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. పవర్‌ప్లేలో ఆయన బాదే షాట్లు ప్రత్యర్థి టీమ్ కు వణుకు పుట్టించడం ఖాయం. వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు సంజుకు తన ఫామ్‌ను నిరూపించుకోవడానికి జనవరి 31న న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్ చాలా ముఖ్యం.

## వరల్డ్ కప్‌లో సంజూ సెంచరీ కొడతాడు: భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా

టీ20 ప్రపంచ కప్‌లో భారత్ తరఫున సెంచరీ సాధించిన ఏకైక ఆటగాడిగా ఇప్పటికీ సురేష్ రైనా పేరిట రికార్డు ఉంది. అయితే ఈ ఏడాది జరగనున్న టీ20 ప్రపంచకప్ 2026కు ముందు భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. టీమిండియా స్టార్ బ్యాటర్లు సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ కాకుండా.. మరో ఆటగాడు ఈ మెగా టోర్నీలో సెంచరీ సాధిస్తాడని రైనా జోస్యం చెప్పాడు. ఆ రికార్డును కేరళ స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ సమం చేస్తాడని రైనా ధీమా వ్యక్తం చేశాడు. ప్రస్తుతం సంజూ శాంసన్ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నాడు. శుభ్‌మన్ గిల్ జట్టులో లేని సమయంలో ఓపెనర్‌గా వచ్చిన శాంసన్, న్యూజిలాండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో ఆశించిన రీతిలో రాణించలేకపోయాడు. గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో సంజూ శాంసన్ 10, 6, 0, 24 పరుగులు మాత్రమే చేశాడు. అయినప్పటికీ సురేష్ రైనా మాత్రం సంజూ శాంసన్ సత్తాపై నమ్మకం ఉంచడం గమనార్హం."సంజూ శాంసన్ కచ్చితంగా సెంచరీ సాధించే ఆటగాళ్ల జాబితాలో ఉంటాడు. ఆయన ఓపెనర్‌గా వస్తున్నాడు కాబట్టి సెంచరీ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే దక్షిణాఫ్రికాలో రెండు సెంచరీలు బాదాడు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ పోటీలో ఉన్నప్పటికీ, ఈ వరల్డ్ కప్‌లో సంజూనే సెంచరీ కొడతాడని నేను నమ్ముతున్నాను." అని టీమిండియా లెజెండ్ సురేష్ రైనా పేర్కొన్నాడు.

# ఎంపీ పీటీ ఉష భర్త శ్రీనివాస్ మృతి



భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పి.టి. ఉష భర్త వి. శ్రీనివాసన్ శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. శ్రీనివాసన్ కన్నుమూశారని కుటుంబసభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన వయసు 67 సంవత్సరాలు. పీటీ ఉష మరణంపై క్రీడా, ఇతర రంగాల వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం తెల్లవారుజామున వి. శ్రీనివాసన్ తన నివాసంలో అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆయనను పరీక్షించిన డాక్టర్లు శ్రీనివాసన్ మృతిచెందినట్లు ప్రకటించారు. అన్ని వైద్య ప్రయత్నాలు చేసినప్పటికీ, ఆయన ప్రాణాలు దక్కలేదని.. ఆసుపత్రికి తీసుకువచ్చే సరికి పరిస్థితి చేజారిపోయిందని తెలిపారు. వి. శ్రీనివాసన్ మాజీ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. పి.టి. ఉష యొక్క అద్భుతమైన క్రీడా జీవితం మరియు ఆమె రాజకీయ ప్రయాణంలో ఆయన ప్రతి అడుగులోనూ అండగా నిలిచారు. ఆయన ఉషకు బలమైన మద్దతుగా పరిగణించబడ్డారు మరియు ఆమె అనేక వృత్తిపరమైన విజయాల వెనుక చోదక శక్తిగా పరిగణించబడ్డారు. పి.టి. ఉష మరియు వి. శ్రీనివాసన్‌లకు ఉజ్వల్ అనే కుమారుడు ఉన్నారు. వి. శ్రీనివాసన్ మృతి పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబం గురించే తన ఆలోచనలు ఉన్నాయని, మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కూడా వి. శ్రీనివాసన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. "రాజ్యసభ ఎంపీ మరియు భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి.టి. ఉష భర్త శ్రీనివాసన్ మృతి చాలా బాధాకరం. పి.టి. ఉషతో పాటు ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. ఈ క్లిష్ట సమయంలో దేవుడు ఆమెకు మనోధైర్యాన్ని చేకూర్చాలని ప్రార్థిస్తున్నాను" అని పోస్ట్ చేశారు."ఫ్లయింగ్ ఫెయిరీ"గా పిలువబడే పి.టి. ఉష, భారత క్రీడా చరిత్రలో అత్యంత స్ఫూర్తిదాయకమైన వ్యక్తులలో ఒకరు. ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగిన ఈ నష్టం ఆమెకు మాత్రమే కాకుండా ఆమె ప్రియమైన వారికి కూడా తీవ్ర బాధాకరం. క్రీడాకారులు, కోచ్‌లు, అభిమానులు మరియు ప్రజలు సోషల్ మీడియాలో ఆమెకు నిరంతరం ప్రోత్సాహం మరియు మద్దతు సందేశాలను పంపుతున్నారు.

# సూర్యకు అరుదైన ఫీట్ సాధ్యమేనా..?

క్రికెట్ ప్రపంచంలో టీ20 ఫార్మాట్ అంటేనే ఒక రేంజ్ క్రేజ్ ఉంటుంది. అందులోనూ వరల్డ్ కప్ లాంటి మెగా టోర్నీలో టీమ్ ఇండియాను నడిపించడం అంటే అది ఒక అరుదైన గౌరవం. ఇప్పటివరకు మన జట్టును ముగ్గురు దిగ్గజ కెప్టెన్లు మాత్రమే ఈ టోర్నీలో లీడ్ చేశారు. ఇప్పుడు ఆ జాబితాలోకి మన మిస్టర్ 360 ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ అడుగుపెట్టబోతున్నారు. ఫిబ్రవరి 7న ముంబై వేదికగా అమెరికాతో జరిగే మ్యాచ్‌తో ఈ కొత్త ప్రయాణం మొదలవ్వబోతోంది. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్ తరఫున కెప్టెన్సీ చేయడం అంటే అది మామూలు విషయం కాదు. ఇప్పటివరకు 'తలా' ధోనీ, 'కింగ్' కోహ్లీ, 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ మాత్రమే ఈ ఘనత సాధించారు. ఇప్పుడు ఈ ముగ్గురి సరసన సూర్యకుమార్ యాదవ్ పేరు చేరబోతోంది. ఫిబ్రవరి 7న అమెరికాతో జరిగే పోరులో టాస్ వేయగానే.. భారత్‌ను వరల్డ్ కప్‌లో నడిపించిన నాలుగో కెప్టెన్‌గా సూర్య చరిత్ర సృష్టిస్తారు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న జట్టుకు నాయకత్వం వహించడం సూర్యకు ఒక పెద్ద సవాలే అని చెప్పవచ్చు. టీ20 వరల్డ్ కప్ లో భారత్ ప్రయాణాన్ని చూస్తే, ఎంఎస్ ధోనీ ఏకంగా ఐదు ఎడిషన్లలో (2007, 2009, 2012, 2014, 2016) జట్టును నడిపించారు. ఆయన సారథ్యంలోనే 2007లో భారత్ మొదటిసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత విరాట్ కోహ్లీ 2021లో కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నా, దురదృష్టవశాత్తు భారత్ సెమీస్ చేరలేకపోయింది. ఇక రోహిత్ శర్మ 2022లో సెమీస్ వరకు తీసుకెళ్లి, 2024లో అద్భుతమైన విక్టరీతో భారత్‌కు రెండోసారి కప్పు అందించారు. ఇప్పుడు ఈ లెజెండరీ కెప్టెన్ల వారసత్వాన్ని సూర్య ముందుకు తీసుకువెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ ముందు ఒక అరుదైన అవకాశం ఉంది. ఒకవేళ భారత్ ఈసారి కప్పు గెలిస్తే.. ధోనీ, రోహిత్ తర్వాత టైటిల్ గెలిచిన మూడో భారత కెప్టెన్‌గా సూర్య నిలుస్తారు. విరాట్ కోహ్లీకి సాధ్యం కాని ఈ ఘనతను సూర్య సాధిస్తాడా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. హోమ్ గ్రౌండ్ అడ్వాంటేజ్ ఉండటం, అలాగే 2024 విక్టరీ తర్వాత టీమ్ ఫుల్ ఫామ్‌లో ఉండటం సూర్యకు కలిసొచ్చే అంశాలు. బ్యాటర్‌గా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సూర్య, ఇప్పుడు లీడర్‌గా తన సత్తా ఏంటో చూపించాలనుకుంటున్నారు. 2026 వరల్డ్ కప్ గనుక భారత్ గెలిస్తే, క్రికెట్ చరిత్రలో ఎన్నో 'ఫస్ట్ టైమ్' రికార్డులు మన పేరిట నమోదవుతాయి. మూడు టీ20 వరల్డ్ కప్‌లు గెలిచిన మొదటి జట్టుగా భారత్ రికార్డు సృష్టిస్తుంది. అంతేకాదు, వరుసగా రెండు ఎడిషన్లు గెలిచిన తొలి టీమ్ గా కూడా నిలుస్తుంది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఇప్పటివరకు ఏ ఆతిథ్య దేశం కూడా టీ20 వరల్డ్ కప్ గెలవలేదు. ఈసారి సూర్య సేన గెలిస్తే, హోమ్ గ్రౌండ్‌లో కప్పు గెలిచిన మొదటి దేశంగా భారత్ రికార్డ్ క్రియేట్ చేస్తుంది. 2024 వరల్డ్ కప్ ఫైనల్ అనగానే మనందరికీ సూర్యకుమార్ యాదవ్ పట్టిన ఆ అద్భుతమైన క్యాచ్ గుర్తుకొస్తుంది. సౌత్ ఆఫ్రికా చేతుల్లోకి వెళ్లిన మ్యాచ్‌ను ఆ ఒక్క క్యాచ్‌తో సూర్య భారత్ వైపు తిప్పేశారు. అప్పుడు ప్లేయర్‌గా కప్పు గెలవడంలో కీలక పాత్ర పోషించిన సూర్య, ఇప్పుడు నాయకుడిగా ఆ కప్పును కాపాడుకోవాలని చూస్తున్నారు. తన బ్యాటింగ్ స్కిల్స్‌తో పాటు కెప్టెన్సీ వ్యూహాలతో టీమ్ ఇండియాను వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలబెట్టాలని సూర్య పట్టుదలతో ఉన్నారు. మార్చి 8న జరిగే ఫైనల్‌లో సూర్య ఆ ట్రోఫీని ఎత్తుతాడా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సీనియర్లు లేని లోటును సూర్య తన నాయకత్వంతో భర్తీ చేస్తూ భారత్‌కు మూడోసారి ప్రపంచకప్ అందిస్తాడో లేదో చూడాలి.





## 'వేల్పారి'... విక్రమ్, రణ్‌వీర్ సింగ్‌లతో

# శంకర్ భారీ మల్టీస్టారర్..!

భారీ చిత్రాల దర్శకుడు శంకర్ కలల ప్రాజెక్ట్‌గా భావిస్తున్న 'వేల్పారి' సినిమాపై మరోసారి ఆసక్తికరమైన ప్రచారం మొదలైంది. ఈ చిత్రాన్ని ఇద్దరు హీరోల కథగా మార్చి, అందులో ప్రధాన పాత్రల కోసం కోలీవుడ్ స్టార్ విక్రమ్, బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్‌లను తీసుకోవాలని శంకర్ ఆలోచిస్తున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.ప్రముఖ నిర్మాణ సంస్థ పెన్ మీడియా ఈ భారీ ప్రాజెక్టును నిర్మించడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. సినిమా బడ్జెట్, పూర్తి చేయడానికి పట్టే సమయం వంటి వివరాలను శంకర్‌ను ఆ సంస్థ అడిగినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ ఊహాగానాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రముఖ తమిళ రచయిత సు. వెంకటేశన్ రాసిన 'వీర యుగ నాయగన్ వేల్పారి' అనే చారిత్రక నవల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కనుంది.వేల్పారి తమిళనాట గొప్ప దాతృత్వం, ధైర్యసాహసాలకు ప్రసిద్ధి చెందిన రాజు. ఎండిపోతున్న ఒక మల్లెతీగకు తన రథాన్నే పందిరిగా ఇచ్చిన గొప్పదనం ఆయనది. అందుకే 'ముల్లైక్కు తేర్ కొడుత్తాన్ పారి' (మల్లెతీగ కోసం రథాన్ని ఇచ్చిన పారి) అనే సామెత తమిళనాట ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉంది. తమిళ సాహిత్యంలో పేర్కొన్న ఏడుగురు గొప్ప దాతలలో వేల్పారి ఒకరు.గతంలో ఒక కార్యక్రమంలో మాట్లాడిన శంకర్, లాక్‌డౌన్ సమయంలో 'వేల్పారి' పుస్తకం కోసం ప్రయత్నించినా దొరకలేదని, రచయిత సు. వెంకటేశన్ తన సొంత కాపీని చదవడానికి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. 2000 ఏళ్ల నాటి రాజు గురించి అంత గొప్పగా రాసిన ఆ నవల తనను ఎంతగానో ఆకట్టుకుందని శంకర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# 'వారణాసి' రిలీజ్ డేట్ ఫిక్స్...

## 2027 ఏప్రిల్ 7న విడుదల -అధికారికంగా ప్రకటించిన రాజమౌళి

ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'వారణాసి' విడుదల తేదీని దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి అధికారికంగా ప్రకటించారు. సూపర్ స్టార్ మహేశ్ బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం వచ్చే ఏడాది, అంటే 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కొంతకాలంగా ఈ సినిమా విడుదల తేదీపై ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ, శుక్రవారం చిత్ర బృందం దీనిపై స్పష్టతనిచ్చింది.




ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి తన ఎక్స్ ఖాతాలో రిలీజ్ డేట్ పోస్టర్‌ను పంచుకుంటూ, "2027... ఏప్రిల్ 7అని పోస్ట్ చేశారు. దాదాపు అదే సమయంలో మహేశ్ బాబు కూడా ఇదే పోస్ట్‌ను తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దీంతో సినిమా విడుదలపై వస్తున్న అన్ని రకాల ప్రచారాలకు తెరపడినట్లయింది.గత ఏడాది హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో వేలాది మంది అభిమానుల సమక్షంలో ఈ సినిమా టైటిల్‌ను అట్టహాసంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఈ చిత్రానికి 'గ్లోబ్‌ట్రాటర్' అనే వర్కింగ్ టైటిల్ ప్రచారంలో ఉండేది. భారత సినీ చరిత్రలోనే అతిపెద్ద ఫ్యాన్ ఈవెంట్‌లలో ఒకటిగా నిలిచిన ఆ కార్యక్రమంలో, సినిమా కోసం ఏర్పాటు చేసిన 100 అడుగుల ఎత్తు, 130 అడుగుల వెడల్పు గల భారీ స్క్రీన్ అందరినీ ఆశ్చర్యపరిచింది.ఇక ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా 'మందాకిని' పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే ప్రతినాయకుడి పాత్రలో ప్రేక్షకులను భయపెట్టనున్నారు. ఇప్పటికే విడుదలైన వీరి ఫస్ట్ లుక్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది.టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో రాజమౌళి మాట్లాడుతూ, సినిమాలోని ఒక కీలక ఎపిసోడ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "చిన్నప్పటి నుంచి నాకు రామాయణం, మహాభారతం అంటే ఇష్టమని చెప్పాను. మహాభారతం తీయాలన్నది నా కల. కానీ ఈ సినిమా కోసం రామాయణంలోని ఒక ముఖ్యమైన ఘట్టాన్ని చిత్రీకరిస్తానని ఊహించలేదు. మహేశ్ బాబును రాముడి గెటప్‌లో చూసినప్పుడు నాకు ఒళ్ళు గగుర్పొడిచింది" అని అన్నారు. ఆ ఎపిసోడ్‌ను సుమారు 60 రోజుల పాటు చిత్రీకరించామని, ప్రతి రోజు ఒక సవాల్‌గా అనిపించిందని, తన కెరీర్‌లోనే ఇది అత్యంత గుర్తుండిపోయే సన్నివేశాల్లో ఒకటిగా నిలుస్తుందని రాజమౌళి ధీమా వ్యక్తం చేశారు. తాజా ప్రకటనతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# శ్రీనివాస మంగాపురం..


# మంగ గా బాలీవుడ్ బ్యూటీ




టాలీవుడ్ లో ప్రస్తుతం కొత్త టాలెంట్ కు కొదవలేదు. వారసత్వంతో వచ్చే వాళ్లే కాకుండా, ఇతర భాషల నుండి క్రేజీ నటీనటులు కూడా మన దగ్గర పాగా వేస్తున్నారు. ఇప్పుడు ఒక ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ గురించి సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శ్రీనివాస మంగాపురం' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా ద్వారా సూపర్ స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్నారు. హీరో డెబ్యూ అప్‌డేట్ తోనే ఈ ప్రాజెక్ట్ పై మంచి బజ్ క్రియేట్ అయ్యిందిఅజయ్ భూపతి అంటేనే ఒక కల్ట్ రోమాంటిక్ యాక్షన్ స్టైల్ గుర్తుకొస్తుంది. ఆయన సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు చాలా వెయిటేజ్ ఉంటుంది. అందుకే ఈ సినిమాలో హీరోయిన్ గా ఎవరిని తీసుకుంటారనేది కొంతకాలంగా సస్పెన్స్ గా మారింది. రీసెంట్ గా ఈ విషయంలో చిత్ర బృందం ఒక క్లారిటీ ఇచ్చింది. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కూతురు రాషా తడాని ఈ మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇస్తోంది. ఇప్పటికే బాలీవుడ్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాషా, ఇప్పుడు మన టాలీవుడ్ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. లేటెస్ట్ గా ఈ సినిమా నుండి హీరోయిన్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో రాషా 'మంగ' అనే పాత్రలో నటిస్తున్నట్లు రివీల్ చేశారు. ట్రెడిషనల్ లుక్ లో రాషా చాలా క్యూట్ గా కనిపిస్తోంది. ఆమె ఎక్స్‌ప్రెషన్స్ చూస్తుంటే ఈ సినిమాలో పర్ఫార్మెన్స్ కు స్కోప్ ఉన్న క్యారెక్టర్ లోనే నటిస్తోందని అర్థమవుతోంది. ఇప్పటికే 'ఉయి అమ్మ' గర్ల్ గా నెట్టింట ఫుల్ పాపులారిటీ ఉన్న రాషాకు, ఈ తెలుగు డెబ్యూ సినిమా మరింత మైలేజీని ఇస్తుందని ఫిలిం నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే మధ్యప్రదేశ్ లో దాదాపు 30 రోజుల పాటు మొదటి షెడ్యూల్ పూర్తి చేశారు. సినిమాలోని సుమారు 30 శాతం షూటింగ్ కంప్లీట్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం రెండో షెడ్యూల్ లో కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ తో పాటు సాంగ్స్ ను కూడా చిత్రీకరిస్తున్నారు. 2026 లో ఈ సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రొడక్షన్ వాల్యూస్ విషయంలో ఎక్కడా తగ్గకుండా టీమ్ మొత్తం పక్కా ప్లానింగ్ తో ముందుకు వెళ్తోంది.లెజెండరీ ప్రొడ్యూసర్ అశ్వినీ దత్ సమర్పణలో, పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ ప్రాజెక్ట్ కు అదిరిపోయే ట్యూన్స్ ఇస్తున్నారట. ఒక మంచి లవ్ స్టోరీకి పవర్ ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్ తోడైతే రిజల్ట్ ఎలా ఉంటుందో అజయ్ భూపతి గత సినిమాలతో నిరూపించారు. అదే మ్యాజిక్ ఇక్కడ కూడా రిపీట్ అవుతుందని టీమ్ ధీమాగా ఉంది. జయకృష్ణ, రాషా జంట స్క్రీన్ మీద ఫ్రెష్ గా ఉండటం సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్ కానుంది. హీరో, హీరోయిన్ల ఫస్ట్ లుక్ లతోనే సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ అయ్యింది. రాషా తడాని తన గ్లామర్ తో పాటు యాక్టింగ్ తో తెలుగు ఆడియన్స్ ను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.

# క్యాస్టింగ్ కౌచ్ ఉంది...

## మహిళలను వాడుకునేందుకే కొందరు సినిమాలు తీస్తారు: తమ్మారెడ్డి భరద్వాజ



టాలీవుడ్ లో క్యాస్టింగ్ కౌచ్ వ్యవహారం మరోసారి హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. 'మన శంకర వరప్రసాద్ గారు' సక్సెస్ మీట్ సందర్భంగా సినిమాలో చిరంజీవి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారానికి ఆజ్యం పోశాయి. సినిమా ఇండస్ట్రీని అద్దంతో పోల్చిన ఆయన... ఇండస్ట్రీ చాలా బాగుందని... అవకాశాల కోసం అడ్డదారులు తొక్కాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ వ్యాఖ్యలపై సింగర్ చిన్మయి స్పందిస్తూ... ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ఉందని చెప్పారు. చిరంజీవి వ్యాఖ్యలు ప్రస్తుత పరిస్థితికి భిన్నంగా ఉన్నాయని అన్నారు. చిరంజీవి తొలిరోజుల్లో పరిస్థితులు ఎలా ఉండేవో తమకు తెలియదని... కానీ ఇప్పుడు పరిస్థితులు మొత్తం మారిపోయాయని వ్యాఖ్యానించారు. మరోవైపు, ఇదే అంశంపై నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కూడా స్పందించారు. ఇండస్ట్రీలో వేధింపులు లేవని ఎవరూ చెప్పలేరని ఆయన అన్నారు. తెలుగు సినీ పరిశ్రమలో తొలి రోజుల నుంచే ఈ సమస్య ఉందని చెప్పారు. ఒకప్పుడు రాజ కుటుంబాల వారు, జమీందారులు మహిళల కోసమే సినిమాలు తీసేవారని అన్నారు. ప్రస్తుతం ఏడాదికి దాదాపు 250 సినిమాలు నిర్మితమవుతుంటే... వాటిలో 30 నుంచి 40 సినిమాలు మహిళలను వాడుకునే ధోరణితోనే నిర్మితమవుతున్నాయిని తమ్మారెడ్డి చెప్పారు. లైంగిక వాంఛలు తీర్చుకోవాలనే ధోరణి పరిశ్రమలోని ఒకరిద్దరు సినీ పెద్దల్లో ఉందని అన్నారు. క్యాస్టింగ్ కౌచ్ గురించి చిన్మయి చెప్పింది నిజమేనని చెప్పారు.



# జియో హాట్‌స్టార్‌లోకి 6న వస్తున్న రాజాసాబ్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్'. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ కానుంది. దేవనగర సంస్థానానికి ఒకప్పుడు జమిందారు గంగాదేవి (జరీనా వహాబ్). అంత గొప్ప నేపథ్యమున్నా తన మనవడు రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)తో కలిసి గంగమ్మగా సాధారణ జీవితం గడుపుతుంటుంది. తన నాన్నమ్మ అంటే రాజుకు ప్రాణం. వయసు ప్రభావం కారణంగా మతిమరుపు సమస్యలతో బాధపడుతూ ఉంటుంది గంగమ్మ. తనకు సంబంధించిన చాలా విషయాల్ని మరిచిపోయినా తన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం మరిచిపోదు. తనకు కలలో కనిపిస్తున్న తాతని ఎలాగైనా వెతికి తీసుకురమ్మని రాజాసాబ్‌ని కోరుతుంది. కానీ, కనకరాజే తనకున్న రకరకాల విద్యలతో నాన్నమ్మ, మనవడిని నర్సాపూర్ అడవిలోని రాజమహల్‌కి వచ్చేలా చేస్తాడు. ఒక దశలో ఇద్దరినీ చంపేయాలని కూడా అనుకుంటాడు. మార్మిక విద్యలెన్నో తెలిసిన కనకరాజుని రాజాసాబ్ ఎలా ఎదుర్కొన్నాడు? అసలు కనకరాజు గతమేమిటి?అతని లక్ష్యమేమిటి? రాజాసాబ్ జీవితంలోకి వచ్చిన ముగ్గురమ్మాయిలు భైరవి (మాళవిక మోహనన్), ÷-లబెస్సీ (నిధి అగర్వాల్) అనిత (రిద్ధి కుమార్) ఎవరు? తదితర విషయాలను సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.

# పల్నాడు నేపథ్యంలో భగవంతుడు మూవీ




టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భగవంతుడు'. పల్నాడు నేపథ్యంలో ఈ సినిమా రాబోతుండగా.. తాజాగా చిత్ర యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది.పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు తిరువీర్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ సినిమాపై భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా తన సత్తా చాటిన తిరువీర్ ఇందులో మరో విభిన్నమైన మరియు భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపించబోతున్నాడు. జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తుండగా ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళిధర్ గౌడ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం తెలుగుతో పాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది.